తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

## కన్నుల పండువగా శ్రీరామ పట్టాభిషేకం



చంద్రగిరి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: టిటిడి అనుబంధ శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో సోమవారం శ్రీసీతారామ పట్టాభిషేక మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయ కంకణభట్టార్ శ్రీనివాస భట్టార్ ఆధ్వర్యంలో అర్చకులు వేకువ జామున స్వామి వారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీసీతారామలక్ష్మణభరతశత్రుఘ్నులకు, శ్రీఆంజనేయస్వామి వారికి అభిషేకం జరిపించారు. వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటల నుండి 10.30 గంటల వరకు శ్రీరామపట్టాషేక మహోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని శ్రీసీతారాములను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దినేష్, ఓఎస్‌ఓలు బెల్లంకొండ ప్రసాద్, రామకృష్ణ,పరిచారిక రామాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

## అకాల వర్షం - రైతుల కష్టం నేల పాలు..

### - లబోదిబో అంటున్న వేరుశనగ రైతన్నలు..

వరదయ్యపాలెం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త



తిరుపతి జిల్లా, వరదయ్యపాలెం మండలంలో సోమవారం అకాల వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో బలమైన గాలులు వీస్తూ కురిసిన వర్షానికి పొలాల్లో వేరుశనగ పంట వానకు నీట మునిగి పనికి రాకుండా పోయింది. మండలంలోని తొండం బట్టు, నాగనందపురం, పాండూరు తదితర గ్రామాల్లో అకాల వర్షం ధాటికి సుమారు 150 ఎకరాల్లో రైతులు సాగుచేసిన వేరుశనగ పంట వానపాలైంది. ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం రైతులకు కన్నీళ్లను మిగిల్చింది.

# రూ.14 వేల కోట్లతో ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్





సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, హాజరైన అధికారులు, నాయకులు

### రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా.పి.నారాయణ

చిత్తూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: రాష్ట్రంలోని పుర, నగరపాలక సంఘాల పరిధిలోని ప్రతి ఇంటికి కొళాయి ద్వారా నీటి సరఫరా చేస్తామని, ఇందుకోసం రూ.14వేల కోట్లతో పనులు జరుగుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో కమీషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్‌కుమార్, ఇంజనీరింగ్ ఇన్ ఛీఫ్ ప్రభాకర్‌రావు, కలెక్టర్ నగరపాలక ప్రత్యేక అధికారి సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌లతో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ ప్రకారం పుర, నగరపాలక సంస్థల్లో ప్రాధాన్యత క్రమంలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు చేపడుతున్నామని, చిత్తూరునగరంలో రహదారుల విస్తరణ పనులు చక్కగా జరుగుతున్నాయని కితాబిచ్చారు. భవిష్యత్తు అవసరాలు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రోడ్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం వుందన్నారు. నగర, పురపాలక సంఘాల్లో నీటిసరఫరా సాలిడ్‌వేస్ట్ మేనేజ్మెంగ్, యూస్డ్‌వాటర్, రోడ్లు, లైట్లు, పార్కులు ఇతర ప్రాధాన్యత క్రమంలో పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అమృత్, యుఐడిఎఫ్ నిధులతో ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ అందించే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మురుగునీటి నిర్వహణలో భాగంగా 123 పుర, నగర పాలక సంస్థల్లో ఎస్‌టిపిలను నిర్మించేందుకు రూ. 39.21కోట్లు మంజూరుచేసినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా మురుగునీటి కాలువలు నిర్మించేందుకు రూ.29వేల కోట్లతో డిపిఆర్ సిద్ధం చేసామని, మొదటగా ప్రాధాన్యత క్రమంలో రూ. 9వేల కోట్లతో కాలువలు నిర్మించేందుకు నిధులు కేటాయించడం జరిగిందని, రెండు మూడు నెలల్లో టెండర్ ప్రక్రియలు పూర్తి చేస్తామన్నారు. గత వైకాపా ప్రభుత్వం ప్రజలపై చెత్త పన్ను వేసి, డంపింగ్ యార్డులో చెత్తకుప్పలు అలాగే వదిలేసి వెళ్లిందని, రాష్ట్ర వ్యాప్తంగా పేరుకుపోయిన 153లక్షల టన్నుల లెగసి వేస్ట్‌ను తొలగించేపనులు జోరుగా జరుగుతున్నాయని, మే నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. తిరుపతిలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చిందని, ఈ నిర్మాణం అందుబాటులోకి వస్తే చిత్తూరులో ఉత్పత్తిఅయ్యే రోజువారి వ్యర్థాలను అక్కడికి తరలించడం జరుగుతుందన్నారు. ఇటీవల టిట్కో గృహాలను ప్రారంభించి లబ్దిదారులకు అందించడం జరిగిందని, జూన్‌నాటికి మరో నలభైవేల గృహాలను పంపిణీ చేస్తామన్నారు. నగర, పురపాలక సంఘాలు ఆదాయం పెంచుకోవడం కోసం ప్రత్యే కార్యాచరణను సిద్ధం చేసి అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారి సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో రోడ్లవిస్తరణ, అభివృద్ధిపనులు జోరుగా జరుగుతున్నాయని, ఎస్టీపి ప్లాంట్ నిర్మాణానికి మార్కెట్ యార్డులో స్థలం గుర్తించడం జరిగిందని, త్వరలో అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అడవిపల్లి నుంచి నీటి సరఫరా పనులు మరో ఆరు నెలల్లో పూర్తి అవుతుందని, అమృత్‌పథకంలో తీసుకున్న రుణానికి నగరపాలక సంస్థ ప్రతి సంవత్సరం రూ.18 కోట్ల మేర వడ్డీ చెల్లిస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న రోడ్లవిస్తరణ పనులు మరింత వేగంగా చేపట్టడానికి ప్రత్యేక ప్యాకేజీ కేటాయించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలాగే నగరపాలక సంస్థలో ఉద్యోగుల స్థాయిని కార్పొరేషన్ స్థాయికి పెంచాలన్నారు. కమీషనరు నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ కలెక్టరు, ఎమ్మెల్యేల సహకారంతో రోడ్లవిస్తరణ పనులు జరుగుతున్నాయని, బస్టాండ్ రోడ్డును మోడల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారిహేమలత, మాజీ మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే మనోహర్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మెన్ త్యాగరాజులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో

## ఇద్దరు కోర్టు ఉద్యోగులు దుర్మరణం





గంగవరం, తిరుపతి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : గంగవరం మండలం వైయస్సార్ జంక్షన్ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతికి చెందిన ఇద్దరు కోర్టు ఉద్యోగులు దుర్మరణం చెందారు. మృతులిద్దరూ ఆప్తమిత్రులు కావడం విశేషం. ఇద్దరు తిరుపతిలోని కోర్టులో పనిచేస్తూ వారాంతపు సెలవును బెంగళూరులోని ఐపీఎల్ మ్యాచ్ తిలకించి వస్తు విగత జీవులుగా మారడం అందరిని కలిసి వేసింది. ఈ దుర్ఘటకు సంబంధించిన వివరాలకు వెళ్తే.. తిరుపతికి చెందిన ఐదు మంది ఈనెల 5న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్ తిలకించడానికి కారులో వెళ్లారు. రాత్రి మ్యాచ్ ముగిసిన అనంతరం బెంగళూరు నుండి తిరుపతికి బయలుదేరారు. సరిగ్గా గంగవరం వైఎస్ఆర్ జంక్షన్ వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీ హఠాత్తుగా బ్రేక్ వేయటంతో లారీని తప్పించబోయి పక్కకు తిప్పటంతో కారు వెనుక భాగంలో కుర్చోవున్న హరీష్, యుగంధర్ దుర్మరణం పాలయ్యారు. ఈ ఇద్దరూ తిరుపతి కోర్టులో జూనియర్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారు. గంగవరం పోలీసులు మృతదేహాలను పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనతో తిరుపతి కోర్టు ప్రాంగణంలో ఉద్యోగులు, న్యాయవాదులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## మామండూరు వద్ద ఇద్దరు మృతి

రేణిగుంట ఏప్రిల్ 6 ప్రభాతవార్త



రేణిగుంట కడప జాతీయ రహదారిపై సోమవారం రేణిగుంట మండలం మామం డూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా శెట్టిగుంటకు చెందిన వంశి, మునిరాజ అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళ్లి తిరిగి వస్తుండగా మామండూరు వద్ద కోడూరు వైపు నుండి వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ పై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర తమ సిబ్బంది తో సంఘటనా స్థలం చేరుకొని ట్రాఫిక్కును క్రమబద్ధీకరించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి పంపారు. ఇద్దరి వయస్సు దాదాపు 20 నుండి 25 సంవత్సరాల మధ్య ఉంటుందని సీఐ జయచంద్ర ప్రభాతవార్త ప్రతినిధికి తెలిపారు.

## హర్షవీణపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

### దళిత సంఘాల డిమాండ్



రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలోని పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగిని హర్షవీణపై జనసేన నాయకుడు దాడి చేసిన విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వారిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని దళిత సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని రెడ్‌వుడ్ పార్కు నందు దళిత జేఏసి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 2న పట్టణంలోని టోల్గేట్ వద్ద సాయంత్రం ఐదు గంటలకు హర్ష వీణా దళిత మహిళపై తాతంశెట్టి నాగేంద్ర అనే వ్యక్తి కులం పేరుతో దూషించి పోలీసులు చూస్తుండగానే కొట్టడం ఎంతో తప్పు చేశారని, సభ్య సమాజం తలదించుకునే విధంగా ప్రవర్తించారని వీరిపై వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని వారు డిమాండ్ చేశారు. ఈ దాడిని దళిత జేఏసీ పూర్తిగా ఖండిస్తున్నామని, అరెస్టు చేయని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను లేవనెత్తుతామని వారు అన్నారు. మూడు రోజుల్లో తాతంశెట్టి నాగేంద్రను అరెస్టు చేయకుంటే కోడూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలు, రాస్తారోకోలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దయ్య, సురేష్, పండుగోల మణి, చెన్నయ్య, జయచంద్ర, రాజగోపాల్, కొప్పుల శంకరయ్య, కూని నాగరాజా, జయసింహా, వెంకటయ్య, భజన ఈశ్వరయ్య, సభాపతి తదితరులు పాల్గొన్నారు.

## సి.రామాపురం డంపింగ్ యార్డులో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్

### మంత్రి పొంగూరు నారాయణ



రామచంద్రాపురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: సి.రామాపురం సమీపంలోని డంపింగ్ యార్డులో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం ఎంఎల్ఏలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులుతో కలసి ఆయన డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చెత్తమీద చెత్త పన్ను వేసి ప్రజలపై ఎనలేని భారం మోపిందన్నారు. డంపింగ్ యార్డుల్లో 85 లక్షల టన్నుల వ్యర్థాలు పేరుకుపోయా యన్నారు. నెలలోపు ఈ చెత్తను సిమెంట్ పరిశ్రమలకు తరలించి డంపింగ్ యార్డును శుభ్రం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం లెగసీ వ్యర్థాలను రకరకాలుగా వినియోగించు కుని సంపదను స ృష్టిస్తుందన్నారు. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టోక్యో, సింగపూర్‌లలో పర్యటించి వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లను రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో గుంటూరు, విశాఖపట్టణా లలో ఎనర్జీ ప్లాంట్‌లు అందుబాటులో వున్నట్లు తెలిపారు. త్వరలో మరో 6 ప్లాంట్‌లను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్ధన్ చౌదరి, మాజీ ఎంపిపి తానికొండ కేశవులు నాయుడు, టిడిపి నాయకులు నరశింహారెడ్డి, రామిరెడ్డి, గిరిధర్ రెడ్డి, జనసేన తిరుపతి నగర నాయకుడు రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రూ.91 కోట్లతో తిరుపతి వాసులకు ప్రతిరోజూ మంచినీరు

### -సమీక్షలో మంత్రి నారాయణ

తిరుపతి,ఏప్రిల్ 6ప్రభాతవార్త: త్వరలో తిరుపతినగరంలోని ప్రజలకు ప్రతిరోజూ మంచినీరు సరఫరాచేసేలా 91కోట్ల రూపాయలతో పనులు చేపడతామని రాష్ట్రమంత్రి పి.నారాయణ వెల్లడించారు. వందకోట్ల రూపాయలతో ఆధునిక మురుగుకాలువల నిర్మాణం జరుగుతుందన్నారు. రానున్న రెండేళ్లలో తిరుపతివాసుల సమస్యలు శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.సోమవారం సాయంత్రం తిరుపతిలో నిర్మాణంలో ఉన్న నూతన నగరపాలక కార్యాలయ నిర్మాణ పనులను మంత్రి నారాయణ తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, నగరపాలక కమిషనర్ మౌర్యతో కలిసి పరిశీలించారు. నగర ప్రజలకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో నిర్మిస్తున్న నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. నగర పరిపాలన సౌలభ్యం కోసం ఆధునిక హంగులతో ఈ కార్యాలయాన్ని తీర్చిదిద్దుతున్నామని, పనుల్లో జాప్యం లేకుండా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొని పనుల వివరాలను వివరించారు.అలాగే శెట్టిపల్లి భూములపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, సంయుక్త కలెక్టర్ గోవిందరావు,తుడ అధికారులతో సమీక్షించారు.

## యస్వీయూలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సభ..

### సైకిల్ యాత్ర ప్రారంభం

తిరుపతి విద్య ఏప్రిల్ 6 ప్రభాత వార్త

డ్రగ్స్,గంజాయి వినియోగానికి వ్యతిరేకంగా యువతలో చైతన్యం కల్పించేందుకు జిల్లా పోలీస్ శాఖ, ఈగల్ టీం, వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంయుక్తంగా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం శ్రీనివాస ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సైకిల్ యాత్ర - దండి మార్చి 2.0 ను డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ మిషన్‌లో భాగంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ (ఐఏఎస్), జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు (ఐపీఎస్) తదితరులు హాజరయ్యారు. ఐజీపీ ఏ.కే. రవికృష్ణ (ఐపీఎస్) వర్చువల్‌గా పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1.15 లక్షల మంది విద్యార్థులు జూమ్ ద్వారా పాల్గొన్నారు.అధికారులు మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, యువత చైతన్యంతో ముందుకు వస్తే డ్రగ్‌ఫ్రీ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమాచారం తెలిసిన వారు 1972 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా తెలియజేయాలని సూచించారు.యస్వీయూ ఉపకులపతి నరసింగరావు యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు సైకిల్ ర్యాలీని ప్రారంభించగా, ఎస్పీ స్వయంగా సైకిల్ తొక్కి ప్రేరణగా నిలిచారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహర్ ఆచారి, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, యస్వీయూ విసి నరసింగరావు,రిజిస్ట్రార్ భూపతి నాయుడు,కలాం వైబ్రెంట్స్ వ్యవస్థాపకుడు దండి విజయ్ కలాం, సిబ్బంది,విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.





### తిరుపతిలో వేడుకగా

## బిజెపి ఆవిర్భావ దినోత్సవ ర్యాలీ



తిరుపతి,ఏప్రిల్ 6ప్రభాతవార్త: బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తిరుపతిలో సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం తిరుపతిలోని భారతీయ జనతా పార్టీ గంగమ్మ గుడి శక్తి కేంద్రం వద్ద నిర్వహించగా, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అలాగే నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా మౌలిక వసతులు, డిజిటల్ రంగం, పేదల సంక్షేమ పథకాలు, రైతులకు అందుతున్న సహాయంపై వారు వివరించారు. బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు చంద్రారెడ్డి పార్టీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రబాబు యాదవులు మాట్లాడుతూ, బీజేపీ సిద్ధాంతాలు దేశాభివృద్ధి, జాతీయత, ప్రజాసేవ అనే మూడు మూలస్థంభాలపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువ కావాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు బి చంద్రారెడ్డి,బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చా మాజీ ఉపాధ్యక్షులు కట్టమంచి చంద్రబాబు యాదవ్, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి, బిజెపి నాయకులు ఎస్ మస్తాన్, లోక ప్రభాకర్ నాయుడు,విగ్రహాల కళ్యాణి ,తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి , మల్లారపు రవి ప్రసాద్ , 82, 83, 84, 85, బూత్ అధ్యక్షులు ప్రసాద్, బాబు, విజయ్ భాస్కర్ రెడ్డి, రమణప్ప, బిజెపి నాయకులు వాసు, శ్రీకాంత్, మస్తాన్, పేరం బాయ్ తదితరులు పాల్గొన్నారు..

## వ్యవసాయ దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి

### నీటి భద్రత-సాగునీటి సాంఘాల బాధ్యత శ్రీకారం: బొజ్జల సుధీర్‌రెడ్డి





సూరావారి పల్లి సభలోమాట్లాడుతున్న ఎంఎల్ఏ, కాలువ మరమ్మతులకు జేసిబిలు

శ్రీకాళహస్తి రూరల్,ఏప్రిల్ 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి వ్యవసాయ దివ్యక్షేత్రంగా విరాలజిల్లుతుందని ఇక్కడ భూగర్భజలాలను కాపాడుకుంటూ వ్యవసాయానికి ఊతం ఇవ్వాలని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత అనే 100రోజుల కార్యక్రమాలను శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మారుమూల గ్రామం సూరావారిపల్లిలో జలవనరులశాఖ సారధ్యంలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్,శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు బహిరంగసభలో కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ నీటి వనరుల సమర్థ వినియోగం మరియు సంరక్షణ నీటి అత్యవసర అవసరమని పేర్కొన్నారు. వర్షాదారిత వ్యవసాయంపై ఆధారపడే గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కాలువలు, భూగర్భ జలాల పరిరక్షణ అత్యంత ప్రాధాన్యం కలిగి ఉందన్నారు. 100రోజుల కార్యక్రమంలో భాగంగా చేపట్టే ముఖ్య కార్యక్రమాలను వివరించారు, చెరువులు కాలువల పునర్దురణ,చెరువుల పూడిక తీత,కాలువల శుభ్రత, మరమ్మత్తులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచటం,చెరువుల అనుసంధానం, సమీప చెరువులను పరస్పరం అనుసంధానం చేసి వర్షపు నీటిని సమర్థవంతంగా నిల్వ చేసి వినియోగించటం.నీటి సంరక్షణ నిర్మాణాలు, చెక్‌డ్యాంలు పెర్కులేషన్ ట్యాంకులు, రీచార్జ్‌పిట్స్ వ ంటి నిర్మాణాల ద్వారా నీటి నిల్వ భూగర్భ జనాలపునరుద్దరణ,పచ్చదనం పెంపొందించటం నీటివనరుల చుట్టుపక్కల చెట్టు నాటటం ద్వారా పర్యావరణ సమతౌల్యతను కాపాడటం భూగర్భజలాల పునర్దురణ వర్షపు నీటిని నేలలోకి చొచ్చుకుపోయే విధంగా చర్యలుతీసుకొని భూగర్భజలాల స్థాయిని పెంచటం సమీకృత నీటి నిర్వహణ గ్రామస్థాయిలో నీటి వినియోగంపై సమగ్ర ప్రణాళికలు రూపొందించి, సాగు నీటి సంఘాల భాగస్వామ్యంతో అమలు చేయటం సాగునీటి సంఘాలు, నీటి పంపిణి, సంరక్షణ నిర్వహణలో కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు.

#### రైతుల సంక్షేమానికే కూటమి కట్టుబడి ఉంది: ఎంఎల్ఏ

ఈ సభలో స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి గ్రామీణాభివృద్ధి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమన్నారు. చెరువులు కాలువలు పునరుద్దరణ ద్వారా సాగు విస్తీర్ణం పెరగటంతో పాటు రైతులకు లాభదాయకంగా మారుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఇరిగేషన్ అధికారులు చెరువులు, కాలువల పరిస్థితిని పరిశీలించి అవసరమైన పనులపై తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ంరైతులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలతో నిర్ణయాలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమాల్లో జలవనరుల శాఖ ఎస్ఇఈ రాదాకృష్ణ, డిఇఇ శివారెడ్డి, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది, నాయకులుమార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, సింగిల్ విండో ఛైర్మెన్ తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అంక్షితల కృష్ణయాదవ్,ఏర్పేడు పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కామేష్‌యాదవ్, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కుంటిపూడి రమేష్‌నాయుడు, సూరావారిపల్లి రమేష్, కృష్ణం నాయుడు,గుడిమల్లం ఆలయ ఛైర్మెన్ బత్తల గిరినాయుడు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కుప్పంలో యానాది గర్జన నిర్వహిస్తాం

- వైఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జునరావు

కుప్పం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలో ఈనెల 14వతేది యానాది గర్జన కార్యక్రమంను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు యానాదుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తలపలచెంచు మల్లికార్జునరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడుస్తున్నా యానాదుల జీవితాల్లో మార్పులు రాలేదన్నారు. అన్ని విధాలా యానాదులు వెనుకబడి ఉన్నారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు కూడా పదిలక్షల మంది దాకా ఉన్న యానాదులను ఓటు బ్యాంకుగానే చూస్తు ఒడడం బాధాకరమనా ్నరు. యానాదులకు చట్టసభల్లో సైతం నేటికీ ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. ఎస్టీ కమీషన్‌లో సైతం యానాదులకు అవకాశం కల్పించలేదన్నారు. ఎస్టీ వర్గీకరణ జరిగితే యానాదుల హక్కులు సాధించుకోవచ్చని రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి యానాదులను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేషులు యానాదులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటుచేయాలని కోరారు. కుప్పంలో తలపెట్టిన యానాది గర్జన కార్యక్రమంకు రాష్ట్రం నలుమూలలనుంచి యానాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం యానాది గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ఛైర్మన్ అత్తూరు చెంగలరాయలు, అధ్యక్షురాలు ఎలుగోటి రేవతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇండ్ల మల్లికార్జున, మాజీ డివిఎంసి సభ్యుడు మోపూరు అడివయ్య, ఉపాధ్యక్షురాలు పనబాకుల కల్పన, నాయకులు తుమ్మూరు శ్రీనివాసులు, గణపతి పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి నాదెండ్ల జన్మదిన వేడుకలు

**కుప్పం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త** రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి, జనసేన పిఏసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ జన్మ దిన వేడుకలను కుప్పంలో సోమవారం ఘనంగా నిర్వ హించారు. జనసేన కుప్పం ఇన్‌చార్జ్, కాణిపాకం ఆలయ డైరెక్టర్ నరేష్ అధ్వర్యంలో స్థానిక శ్రీ తిరుపతి గంగ మ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు ప ంచారు. ప్రజలకు అన ్నదానం జరిపారు. కార్యక్రమంలో నేతలు పవన్ మహేష్, హరీష్, బాలాజీ, కిషోర్, పవన్‌కుమార్, హంసగిరి, పాండు, మంజునాథ్, సురేష్, చంద్ర, దేవా, వెంకటేష్, విజయ్, నవనీత, హేమ, సరస్వతి పాల్గొన్నారు.



## ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల

కుప్పం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వవిప్, కడ పిఏసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను ంచి వచ్చిన ప్రజల నుంచి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలసి వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారంకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మంత్రులు, ప్రభుత్వవిప్‌లు పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజలనుంచి వినతులు స్వీకరించడం ఆనవాయితీగా వస్తోంది.

## నీటి సంరక్షణ అందరి బాధ్యత - ఎమ్మెల్యే మురళీమోహన్

**బంగారుపాళ్యం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** నీటి సంరక్షణ అందరి బాధ్యతని పూతలపట్టు ఎమ్మెల్యే డా. మురళీమోహన్ అన్నారు. సోమవారం సాయంత్రం జంబువారిపల్లె వెంకటప్పనాయని చెరువు వద్ద నీటిభద్రత, సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భూగర్భజలాల పునరుద్ధరణ, నీటి సంరక్షణ, సమీకృత నీటి నిర్వహణ కార్యక్రమంను ప్రభుత్వం చేపట్టిందన్నారు. చెరువులు, కాలువల దురాక్రమణలను తొలగించి నీటి నిల్వలను పెంచడమే ప్రభుత్వధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి గౌరవాధ్యక్షులు ఎన్‌పి జయప్రకాష్, అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పి ధరణీ, జనార్ధన్‌గౌడు, టిడిపి నాయకులు కోకా ప్రకాష్, కమలనాధరెడ్డి, హేమచంద్ర, రవీంద్రనాయుడు, లోక, గిరిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచ్‌గా రుద్రమూర్తినాయుడు సేవలు మరవలేనివి

పెద్దపంజాణి ఏప్రిల్ 6 ప్రభాతవార్త: లింగాపురం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా రుద్రమూర్తినాయుడు చేసినసేవలు మరువలేనివని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం తాజామాజీ సర్పంచ్ రుద్రమూర్తినాయుడును తెదేపా సీనియర్ నేత నాగిరెడ్డి, ఏఎంసి చైర్మన్ రాజన్న, ఏఎంసి డైరెక్టర్ శంకరప్ప, ఏఎంసి కార్యదర్శి సంజీవ్‌కుమార్ వివిధ ట్రేడర్ల యజమానులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ..2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వైకాపా అరాచకాలకు తట్టుకుని రుద్రమూర్తి నాయుడు సర్పంచ్‌గా గెలుపొందారన్నారు. అప్పటినుంచి ఐదేళ్ళకాలంపాటు ఆయన పంచాయతీ ప్రజలకు అందుబాటులో ఉంటూ పంచాయతీని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషచేశారన్నారు. అనంతరం రుద్రమూర్తినాయుడును ఘనంగా సత్కరించారు. మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.




## వడదెబ్బ నియంత్రణపై మండలస్థాయి సమావేశం



**పులిచెర్ల, ఏప్రిల్ 6, ప్రభాతవార్త** వడదెబ్బ నియంత్రణ మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పులిచెర్ల మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం మండల పరిషత్ కార్యాలయం నందు నిర్వహిం చారు. ఈ సమావేశంలో మం డల పరిషత్ అభివృద్ధి అధికారి రాజశేఖర్ బాబు మాట్లాడుతూ వడదెబ్బపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, అవసరమైన చోట చలివేంద్రాల ద్వార తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మండల తాహసిల్దార్ జయసింహ మాట్లాడుతూ మండలంలో ఎవ్వరూ వడదెబ్బ బారిన పడకుండా, ఏ ఒక్క వ్యక్తి కూడా వడదెబ్బతో మరణించకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎల్లంకివారి పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యల్లయ్య మాట్లాడుతూ ప్రజలు సన్నని, వదులుగా, లేత రంగులో ఉండే కాటన్ వస్త్రాలు ధరించడం మంచిదని, సూర్యరశ్మికి నేరుగా బహిర్గితమయ్య సమయంలో గొడుగు, టోపీ, టవల్, ఇతర సాంప్రదాయ తలపాగాను ఉపయోగించాలన్నారు. దాహం వెయ్యకపోయినా తగినంత నీరు త్రాగాలని సూచించారు. ముఖ్యంగా శిశువులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, ఆరు బయట పనిచేసే వ్యక్తులు, శారీరకంగా అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు ముఖ్యంగా గుండె జబ్బులు లేదా అధిక రక్తపోటు ఉన్నవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆల్కహాల్, టీ, కాఫీ, శీతల పానీయాలు లేదా పెద్ద మొత్తంలో చక్కెరతో కూడిన పానీయాలను సేవించడం నివారించాలన్నారు. పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల వినియోగం కొరకు అన్నిచోట్ల ఓ.ఆర్.యస్. పాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాలలో తగినంత త్రాగునీరు, ఓ.ఆర్.యస్. ప్యాకెట్లు, ప్రథమ చికిత్స సామాగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలియజేసి, ఉపాధి హామీ ఏపిఒకి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించి, వడదెబ్బపై గోడపత్రికలు ఇతర ప్రచార సామాగ్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, మండల విద్యాశాఖాధికారి 2 పోకల తాతయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి, ఉపాధి హామీ ఏపీవో సౌభాగ్యం, ఆరోగ్యవిస్తరణాధికారులుచంద్రయ్య, కృష్ణయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానాలు.

**కుప్పం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త** కుప్పం డి.ఎస్.పి పార్థసారథి, అర్బన్ సిఐ శంకరయ్య ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి నిర్వహించినట్లు అర్బన్ ఎస్ఐ బాబు తెలిపారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ 5 మంది పట్టుబడ్డారన్నారు. వీరిని కుప్పం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 50వేల రూపాయల జరిమానాలను విధించినట్లు ఆయన తెలిపారు. మద్యం తాగి ఎవరైనా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వాడవాడలా భాజపా జెండా ఆవిష్కరణ వేడుకలు

చిత్తూరురూరల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా 37వ డివిజన్ భాజపా ఇన్‌ఛార్జీ. సెంట్రల్ మండల అధ్యక్షుడు షణ్ముగం ఆద్వర్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు సర్కిల్ నందు జెండా ఆవిష్కరణ చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ ద్వారా అనేకమంది పేద, బడుగు, బలహీన వర్గాలకు అన్ని రకాల ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఏకైక పార్టీ బిజెపినేనని, ప్రధాని నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. అనంతరం అందరికీ స్వీట్స్ పంచిపెట్టి, పేదలకు అన్నదానం చేసారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో భాజపా జిల్లా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, మండల అధ్యక్షులు సురేష్, సీనియరునాయకులురామభద్ర, పార్టీనాయకులుకరుణాకర్‌సిద్ద, గోకుల్‌యాదవ్, రెడ్డిమస్తాన్ పాల్గొన్నారు.

## జీర్ణోద్ధారణ, మహాకుంభాభిషేక ఉత్సవాలు

చిత్తూరురూరల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, గిరింపేట బౌండువీధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నందు మే 13,14,15 తేదిలలో జీర్ణోద్దరణ, మహాకుంభాభిషేక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్ నందు కమిటీ నాయకులు సెంథిల్ మాట్లాడుతూ మే 13న వేదపండితుల నేతృత్వంలో పుణ్యాహవాచనం, అంకురార్పణ, కలశ ఆరాధన, గణపతిహోమం, 14న ప్రధాన హోమం, పూర్ణాహుతి, కలశ ప్రతిష్ఠ, 15న వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి శ్రీవారి పుష్పపల్లకి సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహాకుంభాభిషేక ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సభ్యులు గోపి, హరి, రాధాక్రిష్ణ, త్యాగరాజులు, చంద్రాచ్చారి, సతీష్‌కుమార్, రూపసాయి, మూర్తి, మణికంఠ, చిరంజీవి, షణ్ముగం, వేల, వెంకటేష్, శరవణ తదితరులు పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం టీచర్లు నల్ల బ్యాడ్జీలు నిరసన

చిత్తూరు హెల్త్, ఏప్రిల్ 6 ప్రభాత వార్త;



దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కోరుతూ టీచర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు మలిదశ పోరు బాటలో భాగంగా సోమవారం స్థానిక పిసిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల (స్పాట్ కేంద్రం) ముందు నిరసన చేపట్టారు. 30 శాతం ఐ ఆర్ మంజూరు, 12 పి ఆర్ సి కమిటీ నియామకం, తదితర డిమాండ్ల సాధనకు ఈనెల 9వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి స్పాట్ కు హాజరై నిరసన తెలపనున్నారు. నిరసన లో ఫ్యాప్టో జిల్లా అధ్యక్షులు మణిగండర్, సహాధ్యక్షుడు మదన్మోహన్ రెడ్డి, ముక్తార్, జగదీష్, ప్రభాకర్, భాష, అప్పస్, రెడ్డప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు

## 70:30 శాతం నిష్పత్తిలో రిక్రూట్మెంట్, పదోన్నతులు ఇవ్వాలన్నారు



చిత్తూర్ హెల్త్, ఏప్రిల్ 6 ,ప్రభాతవార్త; టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, గిరి ప్రసాద్ సోమవారం విద్యా భవన్ లో పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ తమీముఅన్సారియాను కలిసి వినతి పత్రం సమర్పించారు. పదోన్నతులలో 70:30 శాతం నిష్పత్తిలో రిక్రూట్మెంట్, పదోన్నతులు ఇవ్వాలన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్లో రేషనైలేజేషన్ విద్య ప్రమాణాలు దెబ్బ తినకుండా కనీసం 5 సంవత్సరాల పాటు అవకాశం కల్పించాలన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారిని టెన్త్ స్పాట్లో మినహాయింపు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో పి ఆర్ టి యు నాయకులు విశ్వనాథ్, వెంకటసుబ్బారెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి




**కుప్పం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త** ప్రజల సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ప్రజా సమ స్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు పదిహేను వినతిపత్రాలను కడ పి.డి.కి అందించగా వాటి పరిష్కారంకు గాను సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా పి.డి. మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎందుకు త్వరగా పరిష్కరించలేకపోతున్నారనే దిశగా అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు సైతం ఇటీవల వీడియో కాన ్ఫరెన్స్‌లో ప్రజల వినతులు త ్వరగా పరిష్కరించాలని ఆదేశించారన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ చిట్టిబాబు, ఎఐ బాలకృష్ణ, డిఇలు పురుషోత్తం, గురవారెడ్డి, దస్తగిరి, ఎపిఎం చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భాజపాతోనే దేశాభివృద్ధి సాధ్యం



**కుప్పం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త** భారతీయ జనతా పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బిజెపి కుప్పం ఇన్‌చార్జ్ తులసినాథ్ పేర్కొన్నారు. బిజెపి 46వ ఆవిరా ్భవ దినోత్సవ వేడుకలను సోమవారం కుప్పం బస్టాండు, కమతమూరు, బ్రహ్మదేవర చేన్లు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ పతాకావిష్కరణ చేశారు. మిఠాయిలు పంచారు. ఈసందర ్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశం వికసిత భారత్ దిశగా అడుగులు వేస్తోందన్నారు. దేశ ంలో బలమైన పార్టీగా రూపుదిద్దుకోవడంతో పాటు దేశ అభివృద్ధికి పాటుపడే పార్ ్టగా బిజెపిని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వడివేలు, కుమార్, చల్లకుట్టి, శ్రీధర్, వెంకటేష్, సుబ్రమణి

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ఘనంగా బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

శాంతిపురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త



బిజెపి పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా శాంతిపురంలో సోమవారం నిర్వహించారు మండల కేంద్రంలో పార్టీ జెండాను ఎగరవేశారు అనంతరం బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాశీనాథ్, మండల పార్టీ అధ్యక్షుడు గజేంద్ర మాట్లాడుతూ బీజేపీతోనే భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశ రక్షణ కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు పార్టీ ఓ క్రమశిక్షణ గల పార్టీ అని కష్టపడే వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు అనంతరం మండల పరిధిలోని సోమాపురంలో పార్టీ నూతన జెండాను ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా స్వీట్లు పంచుకున్నారు ఈ కార్యక్రమంలో నేతలు పార్థసారథి ఉపాధ్యక్షుడు కుమార్ రమేష్ వెంకటేష్ సుబ్రహ్మణ్యం రామకృష్ణయ్య నాగరాజు శ్రీనివాసులు మురుగేష్ పాటు పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీలక్ష్మీనారాయణస్వామి కళ్యాణోత్సవం

శాంతిపురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త



శాంతిపురం మండలం కెనమాకనపల్లి గ్రామంలో నెలకొనియుండు శ్రీ లక్ష్మీ నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఘనంగా కళ్యాణోత్సవం నిర్వహించారు ఉదయం ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు అలాగే గరుడోత్సవం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉత్సవాల సందర్భంగా అన్నదాన నిర్వహించారు. ఆలయఅర్చకులునరసింహాచార్యులు, నారా యణచార్యులు, భాస్కరాచార్యులు తో పాటు పలువురు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులు నియామకం

వి.కోట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:

మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 2 వ తేదీతో మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల సర్పంచ్ ల పదవీకాలం ముగియడంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమిస్తూ గ్రామ పంచాయతీలకు నూతన పాలకవర్గం ఏర్పడే వరకు పరిపాలన బాధ్యతలు చేపట్టే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. వి.కోట మేజర్ గ్రామపంచాయతీ, ముధరందొడ్డి కి ఎంపీడీవో, తోటకనమ, యాలకల్లు పంచాయతీలకు తహసీల్దార్, బోయచిన్నాగనపల్లి, జవునిపల్లి కొంగాటం, నెర్నపల్లి పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవోను..చింతమాకులపల్లి కంబార్లపల్లి, పాముగానపల్లె పంచాయతీలకు మండల స్వర్ణ గ్రామం అధికారి (డిప్యూటీ ఎంపీడీవో)ను. పెద్ద బర్నేపల్లి, ఎస్ పండపల్లి గ్రామపంచాయతీలకు మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ను. బోడిగుట్లపల్లి కృష్ణాపురం, పంచాయతీలకు మండల వ్యవసాయ అధికారి. ఒగు, బైరుపల్లి పంచాయితీల కు మండల విద్యాశాఖ అధికారిని నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

## ఎమ్మెల్యే గురజాలతో కలసి ఎంపి నారాయణ పర్యటన

– రోడ్ల విస్తరణ బాగా జరుగుతున్నాయని కితాబు



చిత్తూరురూరల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:

చిత్తూరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణకు సోమవారం చిత్తూరుశాసనసభ్యులు గురజాల జగన్మోహన్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి మురకంబట్టు వద్ద పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నారాయణ సంతపేటలోని నగరపాలక సంస్థ డంపింగ్ యార్డును ఎమ్మెల్యేతో కలసి పరిశీలించి వేస్ట్ ప్రాసెసింగ్ జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకొని మే నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. సంతపేట, కట్టమంచి, సాంబయ్యకండిగ, కొంగారెడ్డిపల్లి, ఫారెస్టురోడ్డు, గిరింపేట, ఇరువారం, పలమనేరు రోడ్డు, దర్గాసర్కిల్ మీదుగా జరుగుతున్న రోడ్ల విస్తరణ పనులను పరిశీలించి బాగా జరుగుతున్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కమీషనరు నరసింహప్రసాద్, చుడా చైర్‌పర్సన్ కఠారిహేమలత, నగరపాలక సంస్థ అధికారులు, తెదేపా శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంరక్షణ భూగర్భజలాల పెంపు ప్రభుత్వ ముఖ్యఉద్దేశం



గుడిపాల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:

నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భజలా పెంపు ప్రభుత్వ ముఖ్యఉద్దేశమని ఎంపిపి గోళ్ల హరిప్రసాద్ చౌదరి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని 189 కొత్తపల్లె చెరువును ఇరిగేషన్ ఏఈ సయ్యద్‌షిరాతో పాటు సందర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత పేరుతో అనంతపురం నందు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, చెరువుల పునరుద్ధరించి భూగర్భజలాలను పెంచడం చెరువుల పూడికతీత కాల్వల అనుసంధానం చెక్‌డ్యాం నిర్మాణం ద్వారా అక్కడి రైతాంగానికి సాగు నుండి సమస్యలేకుండా సంవత్సరం పొడవునా నీటి సౌకర్యం కల్పించడం ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నేటినుంచి 90రోజుల పాటు నిర్వహణకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నాయకులు, రైతులు అధికారులు కలసి క్షేత్రస్థాయిలో ప్రణాళికలు ఏర్పాటుచేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజిఎస్ ఏపోపుష్పలత, నాయకులు చల్లనాగరాజుయాదవ్, అర్జున్‌గౌడ్, సురేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో బిజెపి సంబరాలు



తవణంపల్లె, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:

మండల కేంద్రం తవణంపల్లెలో భారతీయ జనతా పార్టీ 45 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంను పురస్కరించుకొని ఎపార్టీ శ్రేణులు జెండా ఆవిష్కరణ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రమాదేవి, జిల్లా ఉపాధ్యక్షుడు కెవి చంద్రమోహన్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుజిత్‌రెడ్డి, అర్థగిరి వీరాంజనేయస్వామి దేవస్థానం మాజీ డైరెక్టరు వినాయక, జిల్లా ఓబిసి మోర్చా కార్యదర్శి ఎస్ బాలచంద్ర, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, బాలకృష్ణ, సురేంద్రబాబు, యువమోర్చా అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, కరుణాకర్‌రెడ్డి, వంశీరెడ్డి, ఢిల్లీప్రసాద్, శ్రీనివాసులు, మునిరత్నంనాయుడు, వడివేలుశెట్టి, మురుగేషన్, వరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ వారి సేవలు అమోఘం, ప్రశంసనీయం

- రోటరీ క్లబ్ వారి ద్వారా బాలింతలకు డ్రై ఫ్రూట్స్ పంపకం



**తిరుపతి హెల్త్, ఏఫ్రిల్ 6, ప్రభాతవార్త** ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో మెడికల్ సూపరింటెండెంట్ డా. ప్రమీల దేవి, సివిల్ సర్జన్ డా, రామనారాయణ రెడ్డి వారి ఆధ్వర్యంలో (పోస్ట్ నేటల్ మదర్స్) బాలింతలకు 50 గ్రామల డ్రై ఫ్రూట్సును క్లబ్ మెంబెర్స్‌తో కలసి డా. ప్రమీల దేవి ప్రతి ఒక్క బాలింతకు అందజేసారు. తల్లి తన స్థన్య పాలును పెంపొందించుకొనుటకు, తల్లికి హాస్పిటల్‌లో పెట్టు పోషక ఆహారంతో పాటు అదనంగా ఈ డ్రై ఫ్రూట్స్‌ను హాస్పిటల్లో సోమవారం గణంకాలప్రకారం 190 మందికి ఇవ్వడం జరిగింది హ్యూమన్ మిల్క్ బ్యాంకు కు తల్లి వచ్చి, తన బిడ్డకు పాలు ఇచ్చి, ఎక్కువగా వున్నప్పుడు ముక్యంగా తల్లి పాలను దానంగా ఇచ్చే ప్రతి తల్లికి, ప్రతి సారి ఈ డ్రై ఫ్రూట్స్ ఇవ్వడం జరుగుతున్నది. డా. ప్రమీల దేవి మాట్లాడుతూ తల్లి పాలు ప్రాముఖ్యత గురించి బాలింతలకు తెలియ చేయమని, వారిలో అవగాహన పెంచుట తోనే హ్యూమన్ మిల్క్ బ్యాంకు ద్వారా ఎక్కువ మంది శిశువులకు తల్లి పాలను అందించి, వారి ఆరోగ్యాన్ని పెంపొందించ వచ్చునని, తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠమని, ముక్యంగా మొదటగా వచ్చే ముర్రుపాలు శిశువుకు వ్యాధినిరోధక శక్తి కలిగి ఉంటుందని, వ్యాధులు నుండి శిశువును కాపాడుతుందని, శిశువు ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని, తల్లి పాలు ఒక్కటే బిడ్డకు రోజుకు 10 నుండి 12 సార్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ హ్యూమన్ మిల్క్ బ్యాంకు ఛైర్మన్ దామోదరం, తిరుపతి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాజేంద్ర శెట్టి వారి సతీమణి లక్ష్మి, రొటేరియన్ దామోదరం గుప్తా వారి సతీమణి శారద, హేమచందర్, విజయ, జగదీశ్ హ్యూమన్ మిల్క్ బ్యాంకు ఇంచార్జి నోడల్ ఆఫీసర్ డా. చందన, హాస్పిటల్ నోడల్ ఆఫీసర్ డా. శ్రీనివాస్, లెక్చరర్ ఇన్ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డా నిర్మలమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ కళావతి, హెడ్ నర్స్సు అల్లి రాణి, హ్యూమన్ మిల్క్ బ్యాంకు ఇంచార్జి స్టాఫ్ నర్స్సు ప్రసూన, లక్ష్మి దేవి, కుసుమ ఇతర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటి వద్దే కిడ్నీ చికిత్స పెరిటోనియల్ డయాలిసిస్‌పై అవగాహన అవసరం

- మూత్రపిండ వైఫల్య రోగులకు సురక్షితమైన ప్రత్యామ్నాయం
- స్విమ్స్ నెఫ్రాలజీ విభాగాధిపతి డా. రామ్



**తిరుపతి హెల్త్, ఏఫ్రిల్ 6, ప్రభాతవార్త**

తిరుమల తిరుపతి దేవస్థానముల ద్వారా నిర్వహించబడుతున్న శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) దేశవ్యాప్తంగా పెరిటోనియల్ డయాలిసిస్ సేవల్లో ప్రముఖ స్థానం సంపాదించింది. ఇక్కడ పెద్ద సంఖ్యలో రోగులకు విజయవంతంగా చికిత్స అందించడమే కాకుండా, పిల్లల (పిడియాట్రిక్స్) కిడ్నీ వ్యాధుల నిర్వహణలో ప్రత్యేక నైపుణ్యం ఉందని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా ఆర్.వి. కుమార్ తెలియజేశారు. మూత్రపిండాల వైఫల్యం ప్రస్తుతం పెరుగుతున్న ప్రధాన ఆరోగ్య సమస్యలలో ఒకటి. మూత్రపిండాలు మన శరీరంలో రక్తాన్ని శుభ్రపరచే ముఖ్య అవయవాలు. ఇవి సరిగా పనిచేయకపోతే శరీరంలో విషపదార్థాలు పేరుకుపోయి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ పరిస్థితిని క్రానిక్ కిడ్నీ డిసీజ్ అంటారు. ఈ దశలో డయాలిసిస్ అనివార్యం అవుతుంది. ఈ పరిస్థితిలో శరీరంలోని మలినాలు, అదనపు ద్రవాలు తొలగించేందుకు డయాలిసిస్ తప్పనిసరి అవుతుంది. హీమోడయాలిసిస్‌కు ప్రత్యామ్నాయంగా పెరిటోనియల్ డయాలిసిస్ (పిడి) ఇప్పుడు సమర్థవంతమైన, సౌకర్యవంతమైన చికిత్సగా గుర్తింపు పొందుతోందని స్విమ్స్ నెఫ్రాలజీ విభాగాధిపతి డా. రామ్ పేర్కొన్నారు. ప్రతి రోజు సుమారు 110 మంది ఇన్ పేషంట్స్‌గా వివిధ మూత్రపిండాల వ్యాధులకు చికిత్స పొందుతున్నారు. రోజుకు 20 మందికి కొత్త అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు.

## కార్వేటినగరంలో బిజెపి జెండా ఆవిష్కరణ

**కార్వేటినగరం,ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**



కార్వేటినగరంలో భారతీయ జనతాపార్టీ జెండాను సీనియర్ నాయకుడు నడింపల్లి యువరాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరిం చారు. బిజెపి ఆవిర్భావ దినోత్సవం సంధర్భంగా జెండావందనం నిర్వహించారు.కార్వేటినగరంలోని పోలీసుస్టేషన్ కూడలి,గాంఢ్లమిట్ట కూడలి వద్ద జెండాలను ఆవిష్కరించారు.ఈ సంధర్భంగా యువరాజు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి ఆధ్వర్యంలో దేశం ఎంతో అభివృద్ధి చెందినదని అన్నారు. ప్రతి ఒక్కరూ బిజెపికి మరింత చేయూతనివ్వాలన్నారు.కార్యక్రమంలో బిజెపి నాయకులు,కార్యకర్తలు జెండావందనం చేశారు.

## మహిళల ఎదుగుదలకు విద్య-ఆరోగ్యం కీలకం..

పద్మావతి కళాశాలలో ప్రేరణాత్మక సదస్సు

**తిరుపతి విద్య, ఏప్రిల్ 6 ప్రభాతవార్త**



మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలంటే విద్యతో పాటు ఆరోగ్యం, ఆత్మ విశ్వాసం కీలకమని నిపుణులు పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ , పీజీ కళాశాలలో "మహిళా సాధికారత – ఆరోగ్యం ప్రాముఖ్యత" అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఈ సందేశం వినిపించింది. కళాశాల ప్రిన్సిపల్ డా. తిరుమల నారాయణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు ఆరోగ్యంపై చైతన్యం కలిగి ఉంటేనే సరైన నిర్ణయాలు తీసుకోగలరని తెలిపారు. కుటుంబం, సమాజం అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, ముందస్తు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న గైనకాలజిస్ట్ డా. ఆర్. ఆశాలత మాట్లాడుతూ, మహిళలు విద్య, వైద్య, క్రీడలు, రాజకీయాలు వంటి అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని సూచించారు. చదువు ద్వారా వచ్చే జ్ఞానం, ఆత్మవిశ్వాసం మహిళలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని తెలిపారు. పెళ్లి, కుటుంబ బాధ్యతల కారణంగా కెరీర్‌ను వదిలేయకుండా లక్ష్యసాధనలో ముందుకు సాగాలని ప్రోత్సహించారు.మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తూ, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన అవసరమని తెలిపారు. హెచ్‌పీవీ (హెచ్ పి వి ) వ్యాక్సిన్ ప్రాముఖ్యతను వివరించి, పౌష్టికాహారం, ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. అలాగే టెక్నాలజీ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు.ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డా. బి. జ్యోతి మాట్లాడుతూ, మహిళా విద్య సమాజ అభివృద్ధికి పునాది అని, చదువుకున్న మహిళ తన కుటుంబంతో పాటు సమాజాన్ని కూడా మార్చగలదని తెలిపారు.ఈ కార్యక్రమంలో డా బి లక్ష్మి, డా వై. జయశ్రీ, డా పి శ్రీలత, డా కే విజయ్ కుమారి, డా జి శ్రీవాణి, డా కె.పి పద్మజ, సాయికుమారి డా కస్తూరి, డా పద్మావతి, డా పద్మిని, డా నాగమణ, డా హేమలత, డా భారతి, డా చెంచులక్ష్మి, అధ్యాపకులు , విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఘనంగా పులివర్తి వినీల్ జన్మదిన వేడుకలు

**రామచంద్రాపురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**



మండల కేంద్రంలో టిడిపి యువనేత పులివర్తి వినీల్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యర్రావారిపాలెంలో ఘనంగా పులివర్తి వినిల్ జన్మదిన వేడుకలు

**యర్రావారిపాలెం, ఏఫ్రిల్ 6, ప్రభాతవార్త**



యర్రావారిపాలెం మండలంలో తెలుగు యువత ఆధ్వర్యంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిగారికుమారుడు పులివర్తి వినిల్ జన్మదినాన్ని మండల తెలుగు యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, యువత నాయకులు చిన్నపరెడ్డి, నిరంజన్ బాలకృష్ణమనాయుడు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండలపార్టీ అధ్యక్షులు దేశిరెడ్డి రఘునాథతో కలిసి ఉదయం తలకోన సిద్దేశ్వర స్వామి అభిషేక సేవలో పాల్గొని వినిల్ ఆయురారోగ్యాలతో ఉండాలని యువతకు ఆదర్శంగా ఉండెలా దేవుడి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. అనంతరం యర్రావారిపాలెం మండల కేంద్రానికి చేరుకొని మండల ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడుఆధ్వర్యంలో యల్లమంద వేణు, అశోక్ రెడ్డి, జగదీష్, లక్ష్మిదేవి, నాగభూషణం, సిరివెలు రమేష్ సహకారంతో ఘనంగా బాణాసంచా పేల్చి కేక్ కటింగ్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ జన్మదిన వేడుకలకు మండల అన్ని పంచాయతీ ల నుంచి నాయకులు కార్యకర్తలు చేరుకొని కోలహాలంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. యువనాయుకుని జన్మదిన వేడుకలు చేసుకోవడం ఆనందంగా ఉందని నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేసారు.

## అమరావతిని రాజధానిగా తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం - షణ్ముగంరెడ్డి

**పుత్తూరు రూరల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**



అమరావతి మన ఏకైక రాజధానిగా స్థిరపడిన ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని చిత్తూరు పార్లమెంట్ నగరి నియోజక వర్గం పుత్తూరు మున్సి పాలిటీ 1వ వార్డులో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలసి ప్రతి గడపప ముందు రంగు రంగుల ముగ్గులు వేసి దీపాలు పెట్టి జై అమరావతి అంటూ నినాదాలు చేస్తూ పండుగ వాతావరణంలో వేడుకలు ఘనంగా నిర్వహించామని చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని కేవలం పరిపాలనా కేంద్రం మాత్రమే కాదని, అది ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. రైతుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షలు, రాష్ట్ర భవిష్యత్ అన్ని కలసిన సమగ్ర అభివృద్ధి దిశగా అమరావతినిలుస్తుందని పేర్కొన్నారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే విజన్ ఆయపదేనని అన్నారు. అలాగే యువ నాయకుడు నారా లోకేష్ యువతను చైతన్యపరస్తూ అమరావతి అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా టీఎన్‌టీయూసీ కార్యదర్శి మణిరెడ్డి, మార్కెట్ కమిటీడైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వార్డు అధ్యక్షులు చొక్కా లింగారెడ్డి, వార్డు ప్రధాన కార్యదర్శి మునస్వామి, వార్డు రైతు అధ్యక్షుడు అర్జున్‌రెడ్డి, ఐటీడీపీ అధ్యక్షుడు గణేష్, ఆర్ముగంరెడ్డి, మణిరెడ్డి, కుప్పారెడ్డి, తంగమ్మ, కృష్ణవేణి, గోవిందరాజులు, అర్జున్‌రెడ్డి, వెంకటముని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**పుత్తూరు రూరల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**



పుత్తూరు మండలంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు జిల్లా కార్యదర్శి కె.బాబు ఆపస్, గౌరవ అధ్యక్షుడు మేకల సుబ్రహ్మణ్యం, అసెంబ్లీ కన్వీనర్ కె.ఎన్.హరిబాబు, మండల అధ్యక్షుడు జై.గిరిప్రసాద్, చెన్నకేశవులు ఆధ్వర్యంలో పతాకావిష్కరణ జరిగింది. అదే విధంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణీలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం.శేఖర్‌మూర్తి, రిటైర్డ్ టీచరు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్‌రెడ్డి, గోవిందరాజులు, రామూర్తి, భక్తవత్సలం, తదితరులు పాల్గొన్నారు.

## ఏఎం పురంలో విద్యుత్ సమస్యలు

**పుత్తూరు రూరల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

ఇటీవల పలు గ్రామాల్లో గతంలో ఉన్న వీధి విద్యుత్ స్తంభాలను తొలగించి నూతనంగా విద్యుత్‌శాఖ నిర్మిస్తున్నాయి. ఈ క్రమంలోనే గత వారం ఏఎం పురం గ్రామ పంచాయతీలోకొత్త విద్యుత్ స్తంభాలను మీటర్లను నిర్మించారు. అయితే అవి పనిచేయకపోవడంతో ఆ సమస్యను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే సమస్య ఆయన పరిష్కారంతో నేడు కార్యాలయ ఆదేశాల మేరకు ఏఎం పురంలో రెండు రోజుల్లో విద్యుత్ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు విద్యుత్ శాఖ తెలిపారు.

## మార్గదర్శి బంగారు కుటుంబం 10-20 స్వర్ణాంధ్ర 2047

**సత్యవేడు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**



సత్యవేడు మండలంకు చెందిన బాలరాజుకి పీ4 పురస్కారం బహుమతిని సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులు చేతుల మీదుగా అందుకోవడం జరిగిం ది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఆదేశాల మేరకు సత్యవేడు నియోజకవర్గ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకరరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు కొందూరు బాలరాజు సోమవారం పీ4 కార్యక్రమం కింద ప్రశాంతపత్రం, అవార్డు పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణవనం మండలం అధ్యక్షుడు గిరిబాబు పాల్గొన్నారు. పీ4 కార్యక్రమంలో భాగంగా సత్యవేడు నియోజకవర్గంలో బంగారు కుటుంబాలకు మీరు అందించిన సేవలను గుర్తించి గౌరవ పూర్వకంగా మెమెంటో అందించడం జరిగిందన్నారు.

## జర్నలిస్ట్‌లకు ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహణ

జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో తిరుపతి పట్టణ పరిధిలో అక్రెడిటేషన్ కలిగిన పాత్రికేయులకు ఈ నెల 07 నుండి 10 వరకు అమరా ఆసుపత్రి, కరకంబాడి వారి సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సోమ వారం పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్ట్ ల ఆరోగ్య భద్రతకు పెద్ద పేట వేస్తున్నదని, ఇందులో భాగంగా అమరా ఆసుపత్రి నందు తిరుపతి పట్టణంలోని జర్నలిస్ట్ లు, తమ కుటుంబ సభ్యులకు మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మెడికల్ క్యాంప్ ఉ.8.00 గం.లకు ప్రారంభం అవుతుందని, వైద్య పరీక్షలకు హాజరగు వారు ఆన్ లైన్ నందు షేర్ చేసిన అప్లికేషన్ ఫారంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దీనితో పాటు వాట్స్ అప్ నందు షేర్ చేసిన పిడిఎఫ్ అప్లికేషన్ ఫారంను నింపి ఆసుపత్రి నందు ఐ!!పిఆర్ సిబ్బందికి సమర్పించాలని తెలిపారు. రక్త పరీక్షలు (డయాబెటీస్), లిపిడ్ ప్రొఫైల్ పరీక్షల కోసం, ఖాళీ కడుపుతో రావాలని, అలాగే గతంలో చేయించుకున్న వైద్య పరీక్షల రిపోర్ట్ ఏవైనా ఉంటే వాటిని తీసుకురావాలని సూచించారు. తదుపరి వివరాల కొరకు అమర ఆసుపత్రి సిబ్బంది హేమకుమార్ 8121444424, ఐ అండ్ పి ఆర్ సిబ్బంది లక్ష్మీనారాయణ 9989349785 ను సంప్రదించగలరు.

## మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్.....

**రేణిగుంట ఏప్రిల్ 6 ప్రభాతవార్త**



మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ కు తీర్చిదిద్దాలని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ జయచంద్ర, సంయుక్తంగా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ నేతృత్వంలో మాదక ద్రవ్యాలు (మత్తు పదార్థాలు) నిర్మూలన కోసం "దండి మార్చ్ 2.0" సైకిల్ యాత్రను సోమవారం ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 జిల్లాలు 100 నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న ర్యాలీ తిరుపతి రేణిగుంట మార్గంలోని తిరుచానూరు రైల్వే స్టేషన్ చేరుకున్న అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర, గాజులమండ్యం ఎస్సై నాగరాజు, తిరుచానూరు ఎస్సై సుధాకర్ పోలీసులు, ప్రజలు సంఘీభావంతో అపూర్వ స్వాగతం పలికారు. ర్యాలీ తిరుపతి నుండి విశాఖపట్నం వరకు దాదాపు 1000 కిలోమీటర్లు సాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. పోలీస్ అధికారులు ర్యాలీలో కొద్ది దూరం పాల్గొని డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్సును పూర్తిగా విడనాడి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని అధికారులు యువతకు పిలుపునిచ్చారు. ప్రజలు ప్రతిరోజు కనీసం ఒక గంట సైకిల్ తొక్కడం వల్ల గుండె, కిడ్నీ, మెదడు, కాలేయ, కీళ్లు, ఎముకలు, ఊపిరితిత్తులకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు రాకుండా ఆరోగ్యవంతంగా జీవించే అవకాశం లభిస్తుందన్నారు.

# తిరుపతి డివిజన్

## నీటి భద్రత సాగునీటి బాధ్యత



**సత్యవేడు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** సత్యవేడు మండలం అంబాకం పంచాయతీలో నీటి భద్రత–సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ సత్యవేడు మండల అధ్యక్షుడు పరుచూరి శివకుమార్ నాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న బృహత్తర జలయజ్ఞంలో భాగంగా జరుగుతోంది. ఈ సందర్భంగా చెరువుల పునరుద్ధరణ, పూడికతీత, కాల్వల అనుసంధానం వంటి ముఖ్య పనులపై నాయకులు, అధికారులతో కలసి సమీక్ష నిర్వహించారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ వారికి ఉపయోగపడే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని శివకుమార్‌సూచించారు. అనంతరం రైతులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి, ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాలను వివరించారు. భూగర్భజలాల పెంపు, నీటి సంరక్షణ, సాగునీటి అందుబాటును పెంచడం ద్వారా రైతుల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజాశెట్టి, శివనాదం యాదవ్, ఆయకట్టు అధ్యక్షుడు, సీనియర్ నాయకులు శివయ్యనాయుడు, వెంకటేశ్వర్లు, రాజా, శరత్, హరి, జడేరి, మాజీ సర్పంచ్ బాబు, సత్యవేడు టౌన్ మాజీ వార్డు మెంబరు కోనయ్య, తెలుగు యువత అధికార ప్రతినిధి తిరుపతి పార్లమెంట్ వి.తులసి, ఇరిగేషన్ ఏఈఈ మురళీమోహన్, జూనియర్ అసిస్టెంట్ తిలక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మునేశ్వరి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## సత్యవేడు మండల అధ్యక్షుడుగా శివకుమార్

**సత్యవేడు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**



సత్యవేడు నియోజకవర్గంలో సత్యవేడు హెడ్ క్వార్టర్స్ కి నూతనంగా నియమితులైన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పరుచూరి శివకుమార్‌ని జనసేన మండల అధ్యక్షుడు రూపేష్ నాయకులతోమర్యాద పూర్వం గా కలసి ఆయనకి శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వంతో మడలాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలని తెలియజేశారు. మీ వెంటే జనసేన పార్టీ నాయకులు కలసి ప్రయాణిస్తామని పేర్కొన్నారు.జనసేన మండల కమిటీ నాయకులు జనరల్ సెక్రటరీ మునిశేఖర్, కుమార్, సెక్రటరీలు అనిల్ కుమార్,మునికుమార్,జయకృష్ణ,కిరణ్‌కుమార్,నాయకులుభువనేశ్వరయ్య,సాయి,దుర్గంమనీపాల్గొన్నారు.

## మాజీ ఎంపీ పనబాకలక్ష్మిని కలసిన మాజీ ఎమ్మెల్యే హేమలత

**సత్యవేడు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**



సత్యవేడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే హేమలత సోమవారం తిరుపతిలోజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎంపీ పనబాక లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిధిలో పార్టీ రాజకీయ పరిస్థితులు అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా సత్యవేడు నియోజకవర్గం రాజ కీయ మలుపులు ఏంటి..?తధానతారం రాజకీయ వ్యవహారాలపై వీరు చర్చించుకున్నట్లు తెలియ జేశారు.

## కేవీబీపురంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మించాలి

కలెక్టర్‌కు విన్నవించిన ఎమ్మెల్యే

**కేవీబీ పురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

కేవీబీ పురంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మించాలని అలాగే సత్యవేడులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణానికిరూ.50 లక్షలు కేటాయించి సహకరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లకు విన్నవించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి ఫిర్యాదుల దినాన్ని పురస్కరించుకుని సత్యవేడు బార్ అసోసియేషన్ కార్యదర్శి రాజాతో కలసి ఎమ్మెల్యే హాజరై ఈ మేరకు వినతి పత్రాన్ని కలెక్టర్‌కి అందజేశారు. అలాగే కేవీబీపురంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మించాలని అందుకు స్థలం కేటాయించాలని వెంటనే కేవీబీపురం తహసీల్దార్‌కి ఫోన్ చేసి స్థలం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే కల్యాణ మండపం నిర్మాణానికి టీటీడీ ఈవోకు లేఖ రాస్తానని కలెక్టర్ తెలిపినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

## దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులు : డిపో మేనేజర్

**కేవీబీ పురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దివ్యాంగ శక్తి పథకంలో భాగంగా దివ్యాంగులకు ఉచిత ప్రయాణ బస్సు పాసులను మంజూరు చేయనున్నట్లు శ్రీకాళహస్తి డిపో మేనేజర్ రేవతి ఒక ప్రకటనలో తెలిపారు. నేడు మంగళవారం శ్రీకాళహస్తి బస్ స్టేషన్‌లో ప్రత్యేక కౌంటర్ ద్వారా ఈ పాసులను జారీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇందు కోసం ఆధార్‌కార్డు, సదరంసర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫోటో తీసుకు రావాలన్నారు. ఈ సందర్భంగా డీఎం రేవతి మాట్లాడుతూ శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కేవీబీ పురం, పిచ్చాటూరు, పెళ్ళకూరు, ఏర్పేడు మండలాలకు చెందిన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన వారందరూ నిర్ణీత గడువు లోపు దరఖాస్తు చేసుకుని ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొందాలని ఆమె సూచించారు.

## జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం

**కేవీబీ పురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన కేవీబీ పురంలో జనతా పార్టీ 44 ఆవిర్భావ దినోత్సవం మండల ఆ పార్టీ అధ్యక్షుడు బాబుయాదవ్ ఘనంగా నిర్వహించారు. కేవీబీ పురం మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ అంత్యోదయ సిద్ధాంతాలతో ముందుకు సాగుతున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ స్థాపకులకు, నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రతి ఒక్కరికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలనాయకులు అభిరాం, శివప్రసాద్, పరందామయ్య, అజిత్ రాయల్, ఎం.ప్రసాద్, సి.వి.రమణ పాల్గొన్నారు.

## టీడీపీ మండల అధ్యక్షుడికి ఘన సన్మానం

**కేవీబీ పురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

టీడీపీ మండల అధ్యక్షుడు మునస్వామి యాదవ్‌ను ఆ పార్టీకి చెందిన నాయకులు, ఆరె గ్రామస్తులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రకాష్‌నాయుడు, సురేష్, వెంకట కృష్ణయ్య, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన కేవీబీపురం విద్యార్థులు

**కేవీబీ పురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

హిందీసేవా సదన్ మహా విద్యాలయం, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి విశిష్ట హిందీ ప్రతిభ రత్న అవార్డు 2025 ప్రధానోత్సవ కార్యక్రమం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోజరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మొదటిఅదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యవాణి, అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్, అనంతపురం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జగదీష్, కేంద్ర ప్రభుత్వ బొగ్గు, కనుల మంత్రిత్వ శాఖ సలహాదారు శృతి కాంత్ భారతి, హై కోర్టు న్యాయవాది వెంకట్రామ్ నరసింహారెడ్డిలు పాల్గొన్నారు. కేవీబీపురం ఉన్నత పాఠశాలకు చెందిన ఆరు మంది విద్యార్థులకు హిందీ ప్రతిభా రత్న 2025 అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న విద్యార్థులు ఎన్.వైష్ణవి(9వతరగతి), డి.కీర్తన(9వ తరగతి), డి.కీర్తి(8వ తరగతి), కె.ప్రేమలత(8వ తరగతి), జె.లక్ష్మి స్రవంతి(8వ తరగతి), డి.దేవశ్రీ ప్రసాద్(7వ తరగతి) హిందీలో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు అనితని కూడా సన్మానించి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కూనాటి సురేష్ మాట్లాడుతూ కేవీబీ పురం ఉన్నత పాఠశాల అన్ని రంగాలల్లో ముందంజలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు.

## నీటి సంరక్షణ, సాగునీటి సమర్థ వినియోగంపై అవగాహన సదస్సు

**విజయపురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**



విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని సాగునీటి సంఘ అధ్యక్షుడు, ఆయకట్టు నీటిపారుదల రైతులకు నీటి సంరక్షణ, సాగునీటి సమర్థ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈఈ వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సాగునీటి సంఘాల అధ్యక్షుల బాధ్యతలు, రైతుల భాగస్వామ్యంపై తీసుకోవాల్సిన అవసరాలను వివరించారు. అధికారులు సంబంధిత రైతులతో పరస్పరం చర్చించి నీటి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ కిరణ్, ఇరిగేషన్ మండల ఏఈఈ ప్రశాంత్, మండల పరిధిలోని పలువురు నీటి సంఘ అధ్యక్షుడు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

# పేట పట్టణ రోడ్లన్నీ...చినుకు పడితే చిత్తు చిత్తే



నాయుడుపేట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: మున్సిపాలిటీ అధికారులకి ఏమైంది అంటూ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం నాయకులు సిఐటియు నాయకులు కలిసి పాత శివాలయం రోడ్డు మీద ప్రమాద హెచ్చరిక బోర్డులతో నిరసన కార్యక్రమంలో సిపిఎం నాయకులు ముకుంద అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ సూచన కొద్దిపాటి వర్షానికే పట్టణ రోడ్లన్నీ గుంతల పురాతన కాలంలో కట్టిన కాలువలు కారణంగా చిత్తుచిత్తుగా మారి వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్న పట్టించుకోని మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై సిపిఎం నాయకులు సోమవారం ప్రమాద హెచ్చరిక బోర్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఉన్న అన్ని రోడ్లను గ్యాస్ పేరుతో ఎక్కడపడితే అక్కడ ధ్వంసం చేసి రోడ్లను నిర్లక్ష్యంగా వదిలేయడంతో సోమవారం తెల్లవారుజామున కురిసిన కొద్దిపాటి వర్షానికి ఆ గుంతల్లో నీళ్ల నిలబడి రోడ్లు ప్రమాదకరంగా మారి ప్రజల ప్రాణాలు పోయే పరిస్థితులు ఎదురవుతున్న మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యం వహించడంపై ప్రజల్లో ఆగ్రహావేశాలు వెలువెత్తుతున్నాయి. పట్టణంలో మరి ముఖ్యంగా అగ్రహారపేట, ట్రెజరీ, మున్సిపాలిటీ,పాత శివాలయం రోడ్లు పై వాహనదాలు ప్రయాణించాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆ రోడ్లమీద చిన్నపిల్లలు,పెద్దలు, మహిళలు శివాలయానికి వచ్చి వెళ్లే భక్తులు, స్కూల్ పిల్లలు వారి తల్లిదండ్రులు నడవడానికి కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. సెజ్ ప్రాంతం కావడంతో నిరంతరం రద్దీగా వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయని వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరి దారి కనిపించక ఒక రకంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, ఎండాకాలం దుమ్ము, దూళి తో నిండిపోయి మరో రకంగా ఇబ్బందులు పెడుతున్న పరిస్థితి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పలుమార్లు నాయుడుపేట మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన అధికారులు నిర్లక్ష్యం వహించడంలో అంతర్యం ఏమిటో అధికారులే వివరించాలి. ప్రజలు ఓట్లతో గెలిచి ప్రజల కోసం పనిచేయవలసిన రాజకీయ నాయకులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎక్కడ స్పందించిన దాఖలాలు లేవు. ఓట్లు వేయించుకొని ప్రజలను గాలికి వదిలినట్లు నాయకుల తీరు ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే మేమేమీ చేయలేం మీ సమస్యలపై ఎమ్మెల్యేని కలవండి అంటూ కమిషనర్ చెప్పడం ఆయన నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతుంది. కార్లలో తిరుగుతూ సమస్యలను చూడని రాజకీయ నాయకులకు ప్రజల బాధలు వినిపించే అవకాశం లేదన్నది వాస్తవం. ఇప్పటికైనా నాయకులు అధికారులు వెంటనే స్పందించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చవలసిన అవసరం ఉంది. ఈ సమస్యలను పట్టించుకోకుంటే ఇంకా నిర్లక్ష్యం వహిస్తే ప్రజలను కలుపుకొని మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సిపిఎం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్ ఆఫీజ్ అబ్దుల్లా,రాయపాటి నరేష్ మరి కొంతమంది నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



తడ, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు సోమవారం తడ మండల బిజెపి కార్యాలయం అక్కంపేట నందు మండల బిజెపి పార్టీ అధ్యక్షులు చిల్లకూరు తేజరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ అధిష్టానం మన ఊరు మన జెండా అనే నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ప్రతి గ్రామంలో జెండా ఆవిష్కరించి జండా స్థాపానికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం జరిగిందని, క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే బిజెపి పార్టీ గ్రామంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలు కనిపించే విధంగా క్యూఆర్ కోడ్ తయారు చేశారన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి బిజెపి కార్యకర్త ఇంటిపై బిజెపి పార్టీ జెండా ఎగరు వేయడం జరిగిందని తేజరెడ్డి తెలియజేశారు.

## ఘనంగా కొండేపాటి జన్మదిన వేడుకలు



దొరవారిసత్రం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: ప్రముఖ పారిశ్రామికవేత్త టీడీపీ సీనియర్ నాయకులు కొండేపాటి గంగప్రసాద్ జన్మదిన వేడుకలను దొరవారిసత్రం మండల టీడీపీ కార్యాలయంలో సోమవారం ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి టీడీపీ నాయకులకు, కొండేపాటి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కొండేపాటి మాట్లాడుతూ తనపై ఇంత అభిమానం పెంచుకున్న మిమ్మల్ని ఎన్నడూ మరిచిపోను అంటూ హితవు పలికారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ 200 మందికి అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, టీడీపీ నాయకులు ప్రవీణ్ నాయుడు, సంచి విజయ్ కుమార్, ఉదయ్ కుమార్, జాన్ రమేష్, భాస్కర్ రెడ్డి, రాజేంద్ర నాయుడు తదితరులు ఉన్నారు.

## 46 సంవత్సరాలు పూర్తి చేసుకున్న బీజేపీ పార్టీ



నాయుడుపేట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: 1980 ఏప్రిల్ 6వ తేదీన భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించింది ఇప్పటికీ 46 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా నాయుడుపేట రూరల్ మండలం బిజెపి కార్యాలయం వద్ద సోమవారం నాయకులు జెండా ఆవిష్కరించి పలువురికి స్వీట్లు పంచి పెట్టారు. మన మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపాయి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని మూడు సార్లు ప్రధానమంత్రిగా పరిపాలన నిర్వహించారని ఈ సందర్భంగా వారు అన్నారు. అలాగే మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడుసార్లు ప్రధానమంత్రిగా ఎన్నికైన సంగతి అందరికీ తెలిసిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట రూరల్ మండలం సీనియర్ నాయకులు ఏవీఎస్ రవీంద్ర, రవి, గురు ప్రసాద్ రాజు, వేణయ్య, సుబ్బారావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు మరిన్ని మెరుగైన వసతులు : కొట్టే సాయి



నాయుడుపేట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు చైర్మన్ కొట్టే సాయి సోమవారం నాయుడుపేట పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, ఎస్.జె. జువెలరీస్ అధినేత పొట్లపూడి రాజేష్ వ్యాపార సంస్థను మర్యాదపూర్వకంగా సందర్శించారు. తమ సంస్థకు విచ్చేసిన చైర్మన్ కొట్టే సాయికి రాజేష్ సాదర స్వాగతం పలికారు. శ్రీకాళహస్తి క్షేత్ర అభివృద్ధికి చైర్మన్ చేస్తున్న కృషిని రాజేష్ కొనియాడారు. భక్తులకు మరిన్ని మెరుగైన వసతులు కల్పించే దిశగా పాలకమండలి తీసుకుంటున్న నిర్ణయాలపై ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## ఘనంగా కొండేపాటి జన్మదినం



నాయుడుపేట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: ప్రముఖ పారిశ్రామికవేత్త, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కొండేపాటి గంగా ప్రసాద్‌కు టిడిపి నేత,ఎస్ జె జువెలరీస్ అధినేత పొట్లపూడి రాజేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సూళ్లూరుపేట పట్టణంలోని కొండేపాటి గంగా ప్రసాద్ నివాసంలో సోమవారం ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న టిడిపి నేత పొట్లపూడి రాజేష్ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్‌కు శాలుగా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## బాలచంద్రయ్య శెట్టికి న్యాయం జరిగేలా చూస్తాం

**- ఎమ్మెల్సీ డాక్టర్ శ్రీకాంత్ హామీ**

వాకాడు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : వాకాడు మండలంలోని గంగన పాలెం గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా కార్యదర్శి అయోధ్య బాలచంద్రయ్య శెట్టికి న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్సీ డాక్టర్ శ్రీకాంత్ హామీ ఇచ్చారు. సోమవారం అయోధ్య బాలచంద్రయ్యశెట్టి టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్‌లో ఎన్‌టిఆర్ విగ్రహం ఎదుట 2022లో అప్పటి ఆర్‌డిఓ ద్వారా తనకు జరిగిన అన్యాయంను తెలుపుతూ దీక్ష చేయడానికి పూనుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ శ్రీకాంత్ మీరు ఆగండి, మీకు న్యాయం చేస్తామని తిరుపతి కలెక్టర్‌కి తెలిపి మీ సమస్యను పరిష్కరించాలని సూచించారన్నారు. అలాగే రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకి కూడా తమకు జరిగిన అన్యాయం గురించి తెలిపామని అయోధ్య బాలచంద్రయ్య శెట్టి చెప్పారు.

## నిరుపయోగంగా ఉన్న మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్



వెంకటగిరి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: పట్టణంలోని మార్కెట్ వీధిలో మున్సిపాలిటీ కి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా ఉంది. ఈ షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా మున్సిపాలిటీకి లక్షలాది ఆదాయం వస్తుంది. మున్సిపాలిటీ వారు షాపింగ్ కాంప్లెక్స్ అభివృద్ధి చేయడం లేదని వైసిపి ఆర్టిఐ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు ఆరి శంకరయ్య తెలిపారు. బంధితొట్టి వీధిలో ఉన్న మరో షాపింగ్ కాంప్లెక్స్ కూడా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపాలిటీకి ఈ షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా లక్ష రూపాయలు ఆదాయం ప్రతినెలా వస్తుంది అన్నారు. మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేయాలని కమిషనర్ ఈగ కిరణకు శంకరయ్య వినతిపత్రం అందజేశారు.

# శ్రీకాళహస్తి చేరిన దండి మార్చ్ 2.0

## -శ్రీకాళహస్తి పోలీసులచే ఘన స్వాగతం



శ్రీకాళహస్తి రూరల్ ఏప్రిల్ 6 ప్రభాతవార్త: మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అవసరం అని డీఎస్పీ నరసింహమూర్తి పిలుపు నిచ్చారు.సమాజానికి స్ఫూర్తిగా నిలవాల్సింది యువతే అని సీఐ ప్రకాశ్ కుమార్ పిలుపు నిచ్చారు.సోమవారం తిరుపతి నుంచి ప్రారంభించిన సైకిల్ యాత్ర శ్రీకాళహస్తి సరిహద్దులోని రాచగున్నేరు వద్దకు రాగా పోలీసు అధికారులు ఘనస్వాగతం పలికారు. వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ఉద్యమం దండి మార్చ్ 2.0" సైకిల్ యాత్ర అని వివరించారు. శ్రీకాళహస్తి చేరిన దండి యాత్ర రాత్రి శ్రీకాళహస్తిలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో బస చేసారు. ఉమ్మడి 13 జిల్లాలు, 100 నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మద్దతుగా శ్రీకాళహస్తి పోలీసులు యాత్రికులకు స్వాగతం పలికారు.డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో తిరుపతి నుంచి విశాఖపట్నం వరకు సుమారు 1000 కిలోమీటర్ల మేర కొనసాగుతున్న ఈ యాత్రలో పాల్గొన్న సైకిల్ యాత్రికులు శ్రీకాళహస్తి పట్టణానికి చేరుకోగా, డీఎస్పీ నరసింహమూర్తి, వన్ టౌన్ సీఐ ప్రకాశ్ కుమార్, టూ టౌన్ సీఐ నాగరాజు, రూరల్ ఎస్సై వెంకటేష్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించడంతో పాటు, యాత్రికులతో కలిసి కొంత దూరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మత్తుకు దూరంగా ఉండండి-భవిష్యత్తును బలంగా నిర్మించండి, డ్రగ్స్‌ను వదిలేయండి-ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆహ్వానించండి" నినాదాలతో కార్యక్రమం ఉత్సా హంగా కొనసాగింది. ఈ సందర్భ ంగా డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ, మత్తు పదార్థాల ప్రభావం నుంచి యువతను కాపాడటం ప్రతి కుటుంబం, విద్యాసంస్థ, సమాజం బాధ్యత అని అన్నారు. డ్రగ్స్ సమస్యను అరికట్టాలంటే అవగాహన కార్యక్రమాలు, ప్రజల్లో చైతన్యం, సమిష్టి కృషి ఎంతో అవసరమని తెలిపారు. సీఐ ప్రకాశ్ కుమార్ మాట్లాడుతూ, యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. నాడు మహాత్మా గాంధీ చేపట్టిన దండి యాత్ర స్ఫూర్తితో కొనసాగుతున్న ఈ కార్యక్రమం సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే ప్రధాన ఉద్దేశ్యంగా ముందుకు సాగుతోంది.

## నీటి భద్రత, సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి : గంజి



పుత్తూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు మండలంలోని సాగు నీటి సంఘాలు నీటి భద్రతను బాధ్యతగా చేపట్టాలని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య అన్నారు. ఈ నెల 6 నుంచి జూలై 5వ తేదీ వరకూ 90 రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం నీటి భద్రత, సాగు నీటి సంఘాల బాధ్యత పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా సోమవారం చినరాజుకుప్పం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రాణాధారమైన నీటిని సంరక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై వుందన్నారు. ముఖ్యంగా సాగు నీటి సమర్ధంగా వినియోగించుకునేందుకు చెరువుల మరమ్మతు తర్వాత భూగర్భ జలమట్టం పెంపు వంటి విషయాలపై సాగు నీటి సంఘాలు శ్రద్ధ వహించాలని సూచించారు. రానున్న 90 రోజుల్లో చెరువుల పునరుద్దరణ, సప్లయి ఛానళ్లలో పూడిక తీత వంటి పనులను గుర్తించి అమలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిఇఇ ఎం.శ్రీనివాసులు, టిడిపి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎస్.ఎన్. ధనపాల్, తడుకు సింగిల్ విండో చైర్మన్ కరుణయాదవ్, టిడిపి నాయకులు ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 257 వినతులు



గంగాధర నెల్లూరు, ఏప్రిల్ 6 ప్రభాత వార్త: మండలం ప్రజా పరిషత్ కార్యాల యంలో సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 257 వినతులు అందాయి వీటిలో రెవెన్యూ 117 సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ 50 పోలీస్ శాఖ 46 పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ 13 రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్ 6 అగ్రికల్చర్ 6 పంచాయతీ రాజ్ 6 విద్యుత్ శాఖ 2 సొసైటీ పర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ 2 వాటర్ రిసోర్స్ 2 ఎండో మెంట్ 1 లీగల్ మెట్రాలజీ 1 రోడ్లు, భవనాలు 1 పబ్లిక్ హెల్త్ 1 అనిమల్ హస్బండీ 1 గనులు భూగర్భ శాఖ గనులు వినతులు వచ్చాయి. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెవెన్యూ సమస్యలపై ఎన్నో ప్రణాళికలు తీసుకొచ్చినా, రాష్ట్రంలో ఎ ప్రాంతంలోనైనా ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎన్ని మార్లు నిర్వహిం చినా 50 నుండి 60శాంత వరకు రెవెన్యూ సమస్యలే అధికారుల దృష్టికి వస్తున్నాయని, దీనికి పరిష్కార వేదికలో పరిష్కారాలు కరువై తమ భూములను దక్కించుకోవడానికి న్యాయ స్థానాల మెట్లు ఎక్కి కొన్ని లక్షల రూపాయలు ధారబోసి కుటుంబాన్ని వీధులపాలు చేసుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. అధికార పెద్దలు ప్రజాప్రతినిధులు దీనిపై ప్రత్యేక దృష్టి వుంచి రెవెన్యూ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని ప్రజానీకం కోరుకుంటున్నారు. అనంతరం మండలంలోని వేపంజేరి పెద్ద చెరువు వద్ద నిర్వహించిన సాగునీటి సంఘాల పర్యవేక్షణ విధానాలు కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే విఎం థామస్ జిల్లా కలెక్టర్ జుమిత్ కుమార్ కుమార్‌లు హాజరై తగు సూచనలు సలహాలను విదావాలను ప్రజా ప్రతినిదుల బాధ్యతలను గుర్చి సవివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎరాజేంద్రన్ డిఆర్ఓ మోహన్ కుమార్ ఆర్డిఓ శ్రీనివాసులు ఎంపిడిఓ మనోహర్ గౌడ్ తహసీల్దారు శ్రీనివాసులతో పాటు పలు జంబందిత శాఖల జిల్లా మరియు మండల అధికారులు అర్జీదారులు నాయకులు పలువురు పాల్గొన్నారు.

## పాత సామాను అంగళ్లకు ... బిందు సేద్యం పరికరాలు



పాకాల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: పాకాల మండల పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మామిడి రైతులకు ప్రతిష్టాత్మకంగా 90 శాతం రాయితీ పై పంపిణీ చేస్తున్న బిందు సేద్యం పరికరాలు మండలంలో పెద్ద ఎత్తున తూకం లెక్కలో సెకండ్ హ్యాండ్ మార్కెట్‌కి తరలిపోతున్నాయి. వివరాల్లోకి వెళితే.. పాకాల మండలంలో ఎక్కువగా మామిడి పంట సాగు అవుతోంది మామిడి రైతులు రాయితీ ద్వారా అందిన డ్రిప్ పరికరాల అమరికలో సుమారు మామిడి చెట్టు వయసు పది సంవత్సరాలు కలిగిన మొక్క చుట్టూ కనీసం ఎనిమిది మీటర్ల లేట్రల్ పైపు ఆరు నుంచీ ఎనిమిది డ్రిప్పర్లు వేయవలసి వుంది. కానీ ఇక్కడి రైతులు మాత్రం ఒక అడుగు నుంచి ఒకటిన్నర అడుగు పైపు ఉపయోగించి పైపుకి ఒక వైపైపు అర అంగుళం కుళాయిలు మామిడి చెట్లకు పెద్ద ఎత్తున అమరుస్తున్నారు. తక్కువ నీరు వున్నా ఎత్తు పల్లాలు అన్న తారతమ్యం లేకుండా లేకుండా లాటరల్ పైపులు చెట్టు చుట్టూ వేసి డ్రిప్పర్స్ ద్వారా నీటిని చెట్టుకు అందించవలసి ఉండగా రైతులు మాత్రం ఇవేవి పట్టనట్టుగా చెట్టు చెట్టుకి విచ్చలవిడిగా కుళాయిలు బహిరంగ మార్కెట్ నుంచి కొని బిగించటం వలన మండలంలో నీటి భద్రతకు పెను విఘాతం కలుగుతుంది. ఇవన్నీ బహిరంగంగా తెలుస్తూవున్నా ఇటు డ్రిప్ కంపెనీలు కాని అటు డ్రిప్ తనిఖీ చేసే క్షేత్రస్థాయి అధికారులు కానీ చూసి చూడనట్టు వదిలివేయడం అనుమానాలకు తావిస్తోంది. నీటి లభ్యత తక్కువగా ఉన్నా, కూలీలు అందుబాటులో లేకపోయినా, తక్కువ కరెంటు వినియోగించుకొని మెరుగైన దిగుబడి పొందే లక్ష్యంతో రూపొందించిన ఈ పథకాన్ని దాదాపు 70 శాతం మంది రైతులు మండలంలో నిర్వీర్యం చేస్తున్నారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. పేద మధ్య తరగతి ప్రజల నుంచీ ప్రభుత్వానికి వచ్చే పన్నుల ద్వారా రైతులకు 90 శాతం సబ్సిడీతో అందిస్తున్న ఈ డ్రిప్ పరికరాలు ప్రస్తుతం పాత సామాను అంగళ్లకు కేజీల లెక్కన తరలిపోవడం బాధాకారం. ఇప్పటికైనా సంబంధిత మైక్రో ఇరిగేషన్ అధికారులు కళ్ళు తెరిచి సమస్య పరిష్కరించకపోతే భూగర్భజలాలు అడగంటి పోయే అవకాశం వుంది అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఘనంగా కొండేపాటి గంగా ప్రసాద్ జన్మదిన వేడుకలు



వాకాడు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, మండల టిడిపి కన్వీనర్ మధుసూదన్ రెడ్డిల ఆధ్వర్యంలో టిడిపి సీనియర్ నాయకులు, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగా ప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి టిడిపి నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కొండేపాటి గంగా ప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్చం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని టిడిపి నాయకులు, పలు శాఖల అధికారులు కూడా కలిసి కొండేపాటి గంగా ప్రసాద్‌ను కలిసి శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, వాకాడు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డిలు వేర్వేరుగా మాట్లాడుతూ టిడిపి సీనియర్ నాయకులు కొండేపాటి గంగా ప్రసాద్ ఎవ్వరికి ఇబ్బంది కలుగకుండా వారి మనసులను ముందస్తుగా అర్థం చేసుకోగల గొప్ప వ్యక్తి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలోశాసనసభ్యులు సునీల్ కుమార్, వాకాడు టిడిపి కన్వీనర్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి, కోట టిడిపి మండల కన్వీనర్ పలగాటి భాస్కర్ రెడ్డి, చిట్టమూరు మండల టిడిపి కన్వీనర్ కిషోర్ నాయుడు, మండల నాయకులు కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొని ఆయనకు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

## అధునాతన పద్ధతులు పాటించాలి : ఏడిఏ



వెంకటగిరి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: రైతులు వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతులు పాటించాలని నాయుడుపేట ఏడిఏ ఎం నాగార్జునసాగర్ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం, వేంకటగిరి నందు వ్యవసాయ శాఖ మరియు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ నెల్లూరు జిల్లా వారి ఆధ్వర్యంలో రైతుల విజ్ఞాన యాత్రలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రంని సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయుడుపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రంలోని వివిధ విభాగాల శాస్త్రవేత్తల సాంకేతిక పరిజ్ఞానాలను రైతు సోదరులు అవగాహన చేసుకొని పాటించాలని కోరారు. కే.వి.కే అధిపతి డా. బి. ప్రతాప్ మాట్లాడుతూ రైతులు వరి సాగు మాత్రమే కాకుండా పంటల వైవిధ్యాన్ని, పంట మార్పిడిని పాటించాలని, ఉద్యాన పంటల సాగు పైన, జీవాల పెంపకం పైన, అలాగే పంట కోత అనంతరం వివిధ పంటల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ పైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కే.వి.కే, శాస్త్రవేత్తలు డా. విజయశ్రీ, డా. తిరుపాల్, డా.నాగార్జునరెడ్డి, డా. రాజీవన, నాయుడుపేట వ్యవసాయ అధికారి యం. అనురాధ, నాయుడుపేట, పెళ్లకూరు వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వంలో సాగునీటి రంగం నిర్వీర్యం

**- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**



వెంకటగిరి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: గత వైసిపి ప్రభుత్వం సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండలంలోని వలివేడు గ్రామంలో జల ద్వారా నీటి భద్రత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గత ప్రభుత్వం సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేయడం వల్ల వ్యవసాయం పూర్తిగా దెబ్బతినిందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేసి పంటల సాగుకు పుష్కలంగా నీరు ఇస్తామని చెప్పారు. దాదాపు నాలుగు కోట్ల రూపాయలతో చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులు బాగుంటే రైతులు పంటలు సాగు చేసుకుని సుభిక్షంగా ఉండాలని తెలిపారు. సాగునీటి కాలువలలో పూడిక తీసి అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, ఈఈ బాపిరెడ్డి, ఏ ఈ బాబురావు, టిడిపి నాయకులు మురళి గౌడ్, శివారెడ్డి, తోట రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

వెంకటగిరి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు, సహాయకుల పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయిందని సీడీపీఓ షంషాద్ బేగం తెలిపారు. లక్ష్మీరాంపల్లి జనరల్, విశ్వనాథపురం ఎస్సీ, మరాటిపల్లి ఎస్టీ, బ్యాండుపాలెంఎస్సి, నాగులగుంటపాలెం ఎస్సి, మొత్తం 5 అంగన్వాడీ హెల్పర్ పోస్టులు, కుమ్మరిపేట జనరల్ అంగన్వాడీ వర్కర్ పోస్టు ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. 10వ తగరతి పాసైన స్థానిక వివాహితులు, 21 సం. నుండి 35 సం.లోపు మహిళా అభ్యర్థులు అర్హులు అని వివరించారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 06 నుండి 18లోగా వెంకటగిరి ఐ.సి.డి.యస్ ప్రాజెక్ట్ కార్యాలయం నందు రూ.100 చెల్లించి దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

## ఎన్టీఆర్ విగ్రహానికి రూ. 50 వేలు విరాళం

బాలాయనల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: బాలాయపల్లిలో ఎన్టీఆర్ విగ్రహ స్థాపనకు కయ్యూరు గ్రామానికి చెందిన చెరుకూరు వెంకటకృష్ణయ్య నాయుడు రూ. 50 వేలు విరాళంగా అందజేసారని మండలాధ్యక్షులు రాయి సత్యం నాయుడు తెలిపారు. వెంకటకృష్ణయ్య నాయుడు అకౌంట్‌కి జమచేశారని తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహ స్థాపనకు విరాళం అందించిన వెంకటకృష్ణయ్య నాయుడుకు మండలాధ్యక్షులు రాయి సత్యం నాయుడు ధన్యవాదాలు తెలిపారు.

## చంద్రబాబు, లోకేష్‌ల వల్లే అమరావతి సాధ్యం

**పోతుగుంట విజయ్‌బాబు**



పుత్తూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేష్‌బాబు సమర్ధత, విజన్ వల్లే ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి శాశ్వత రాజధానిగా ఆవిష్కృతమైందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు అన్నారు. అమరావతి శాశ్వత రాజధానిగా పార్లమెంట్ ఆమోదం పొందం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది రైతుల త్యాగానికి ఫలితం దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు, లోకేష్‌లు భవిష్యత్‌లో అమరావతికి ఎటువంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశ్యంతో చేపట్టిన చర్యల వల్లే అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్‌లో పాస్ అయిందని తెలిపారు. ఆటంకాలు తొలగిపోవడం వల్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో అమరావతి అభివృద్ధి పథంలో పురోగమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రవినాయుడు, బాలాజీనాయుడు, ధనపాల్, మధుసూదన్‌రాజు పూల ప్రవీణ్. మురళీరాజు, భాస్కరాచ్చారి తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక అభివృద్ధే దేశ భవిష్యత్తు



తిరుపతి విద్య,ఏప్రిల్ 6 ప్రభాతవార్త: దేశ సుస్థిర అభివృద్ధికి సైన్స్ అండ్ టెక్నాలజీ కీలకమని, మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా స్వదేశీ సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య టాటా నరసింగ రావు పేర్కొన్నారు. యస్వీయూలోని సెంటర్ ఫర్ సౌత్ ఈస్ట్ ఏషియన్ అండ్ పసిఫిక్ స్టడీస్ ఆధ్వర్యంలో రీ కాన్ఫిగరింగ్ ది గ్లోబల్ ఆర్డర్ ఇంప్లికేషన్స్ ఫర్ ఇండియా అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ నరసింగరావు మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో స్వావలంబన సాధించకుండా దేశ అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. కీలకోప న్యాసకుడిగా పాల్గొన్న మాజీ అంబాసిడర్ జితేష్ శర్మ మాట్లాడుతూ, ప్రపంచ రాజకీయ పరిణామాలు, యుద్ధాలు సాంకేతిక రంగంపై కూడా ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పునరుత్పాదక ఇంధన వనరులపై పరిశోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించగా,సమావేశానికి అధ్యక్షత వహించిన ఆచార్య జయచంద్రారెడ్డి ఈ సదస్సు సాంకేతిక అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సెంటర్ డైరెక్టర్ ఆచార్య పూకా రమేష్ బాబు, ఆచార్య ప్రయాగ, ఆచార్య విజయ్ కుమార్‌రెడ్డి, ఆచార్య పద్మజతో పాటు దేశ నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టూరిజం సస్టైనబిలిటీపై పరిశోధన



### మునీర్ బాషాకు డాక్టరేట్

తిరుపతి విద్య, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగానికి చెందిన గడేకరి మహమ్మద్ మునీర్ భాషా డాక్టరేట్ పొందారు. ఆచార్య వి. రమేష్ బాబు పర్యవేక్షణలో టూరిజం సస్టైనబిలిటీ ఎకనామిక్ స్ట్రాటజీస్ ఫర్ ఎంప్లాయ్మెంట్ ఇన్ సదర్న్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పీహెచ్.డి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి ఈ గౌరవాన్ని అందుకున్నారు.దక్షి ణ ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగం ద్వారా ఉపాధి అవకాశాల పెంపు, ఆర్థిక స్థిరత్వం సాధనకు సంబంధించిన అంశాలను తన పరిశోధనలో విశ్లేషించారు.మునీర్ భాషా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పలు పరిశోధన పత్రాలు సమర్పించి అకడమిక్ రంగంలో తన ప్రతిభను చాటుకున్నారు.డాక్టరేట్ పొందిన సందర్భంగా అధ్యాపకులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు ఆయనను అభినందించారు.

# బార్ అసోసియేషన్ ఎన్నికల్లో కొత్త జట్టు విజయం

### న్యాయవాదుల ఆశలు మరింత పెరుగుదల

తిరుపతి విద్య, ఏప్రిల్ 6 ప్రభాతవార్త



తిరుపతి బార్ అసోసియేషన్‌లో 2026-2027 సంవత్సరానికి జరిగిన న్యాయవాదుల ఎన్నికలు సాఫీగా ముగిశాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో సభ్యుల విశ్వాసాన్ని గెలుచుకుని టి. గోపీచంద్ గారు ప్రెసిడెంట్‌గా, సి. శంకర్ రెడ్డి గారు వైస్ ప్రెసిడెంట్‌గా, వి. విద్యానాధ రెడ్డి గారు జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే బార్ అసోసియేషన్ పరిధిలో ఆనంద వాతావరణం నెలకొంది. నూతన కమిటీ న్యాయవాదుల సంక్షేమం, వృత్తి పరిరక్షణ, కోర్టు వ్యవస్థలో మెరుగైన సదుపాయాల కల్పన వంటి అంశాల్లో చురుకైన చర్యలు తీసుకుంటుందని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా న్యాయవాదులు ఎఫ్. థామస్ రాజ్ కుమార్, సి.హెచ్.ఎల్.డి.కె. కుమార్ తదితర న్యాయ వాదులునూతనంగాఎన్నికైన పదాధికారులకుఅభినందనలుతెలిపారు.వారినాయకత్వంలో బార్ అసోసియేషన్ మరింత బలోపేతం అవుతూ, న్యాయవాదుల ఐక్యతను పెంపొందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# వినీల్ జన్మదినం సందర్భంగా అన్నదాన సేవలు

### -అక్షయ క్షేత్రంలో ఘనంగా భర్తడే వేడుకలు



**తిరుపతిరూరల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** చంద్రగిరి ఎమ్మెల్యే పులి వర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ జన్మదిన వేడుకలు దుర్గసముద్రం పరిధిలోని అక్షయ క్షేత్రంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. తిరుచానూరు మార్కెట్ యార్డు ఛైర్మెన్ మౌనికమునిశేఖర్ ఆధ్వర్యంలో యువనేత వినీల్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం అక్షయ క్షేత్రంలోని బుద్ధిమాంద్య పిల్లల నడుమ భర్తడే కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. యువనేత భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించి, ఆయుఆరోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మునియాదవ్, బాబురాయల్, బాబురెడ్డి, సురేంద్రరెడ్డి, బాలయాదవ్, శంకర్, మిథున్ తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ అమరేశ్వరి ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సు

### విద్యార్థులకు విలువైన సూచనలు

పెనగలూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త





రైల్వే కోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు మండల పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో తహసీల్దార్ అమరేశ్వరి ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు తాత్కాలిక ఆనందం కలిగించినా, దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని, భవిష్యత్తును పూర్తిగా నాశనం చేస్తాయని హెచ్చరించారు. చెడు స్నేహితుల ప్రభావానికి లోనుకాకుండా, మంచి స్నేహితులను ఎంచుకోవాలని, జీవితంలో లక్ష్యాలు పెట్టుకుని కష్టపడి చదవాలని సూచించారు. ప్రతిరోజూ క్రీడలు, పుస్తక పఠనం, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉండి చెడు అలవాట్లకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, గురువులతో మాట్లాడాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం చట్టపరంగా నేరమని, ఇందులో పాల్గొంటే కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. ఈ సదస్సులో తహసీల్దార్ అమరేశ్వరి మరియు రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామ్మోహన్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో అవగాహన పెరిగి, మంచి మార్గంలో ముందుకు సాగాలనే సంకల్పం దృఢంగా ఉండాలని తెలిపారు.

# మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



పెనగలూరు , ఏప్రిల్ 6 ప్రభాతవార్త

రైల్వే కోడూరు నియోజకవర్గం పెనుగలూరు మండలం నల్లపురెడ్డిపల్లెలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గంజాయి మరియు మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు పెనుగలూరు ఏఎస్ఐ ఏ.రాముడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పోలీసులు ప్రధానంగా ఈ క్రింది అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే ఆరోగ్యం క్షీణించడమే కాకుండా, ఉజ్వలమైన భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల రవాణా లేదా వినియోగం చేస్తూ పట్టుబడితే కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని, అది వారి కెరీర్‌పై ప్రభావం చూపుతుందని వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువతను వ్యసనాలకు దూరంగా ఉంచి, వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ అవగాహన కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఏఎస్ఐ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కుచేలోపాఖ్యానం ప్రవచనంలో శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ



తిరుపతి,ఏప్రిల్ 6ప్రభాతవార్త: కుచేలోపాఖ్యానం ప్రవచనంతో శతావధాని ఉప్పలదడియం భరత్ శర్మ జనులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని ఇనుమడింపజేసారు. తమకు తోచినది నివేదనగా సమర్పించి, తనను ఆశ్రయించిన భక్తులను శ్రీకృష్ణ పరమాత్మ ఎన్నడూ విడువబోడని శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక అన్నమాచార్య కళామందిరంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన శతావధాని, ప్రవచనకర్త ఉప్పలధడియం భరత్ శర్మ చే కుచేలోపాఖ్యానంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా, ప్రవచనకర్త భరత్ శర్మ ప్రసంగిస్తూ, నవవిధభక్తి మార్గాలలో సఖ్యం ద్వారా కుచేలుడు ఏ విధంగా శ్రీకృష్ణుని ఆశ్రయించి, తన వద్దనున్న పిడికెడు అటుకులను సమర్పించి, ఆ శ్రీకృష్ణుని కటాక్షంతో అష్టైశ్వర్యాలను పొందాడో, అటువంటి అచంచలభక్తి ద్వారా భగవంతుని సాన్నిధ్యాన్ని చేరుకోవచ్చని తెలియజేశారు. అంతేకాక, భగవంతుని లీలలను తెలుసుకొని ఆనందించడానికి, తరించడానికి భాగవత మహాపురాణం ఈ కలియుగ మానవులకు ఒక గొప్ప వరం అని పేర్కొన్నారు. అంతేకాక, ప్రస్తుతం ఉన్న వైజ్ఞానిక యుగంలో పురాణాల అధ్యయనం ద్వారా అనేక వైజ్ఞానిక, సామాజిక, వ్యవహారిక విషయాల పరిశోధన ద్వారా మానవుల దైనందిన జీవితాలు మెరుగుపడతాయని భరత్ శర్మ తెలియజేశారు. ఈ సందర్భంగా, రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి కే ఎన్ రాజా, కళాకారులు, అన్నమాచార్య ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కోకిల , సిబ్బంది ప్రవచనకర్త శతావధాని భరత్ శర్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలం సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి లోక ప్రభాకర్ నాయుడు మస్తాన్ టీచర్ తిరుమలయ్య మల్లారపు రవి ప్రసాద్ పురోహితుడు సురేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన బోధనతో విజయాలు..

### శ్రీరామ కాలేజీ విద్యార్థినికి గోల్డ్ మెడల్

తిరుపతి విద్య ఏప్రిల్ 6 ప్రభాత వార్త




కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజీ మరోసారి తన విద్యా ప్రతిభను చాటుకుంది. ఆధునిక సాంకేతిక విద్యలో ముందంజలో నిలుస్తున్న ఈ కళాశాలకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-డేటా సైన్స్ విభాగం 2021-25 బ్యాచ్ విద్యార్థిని ఎస్. భావన 87.58 శాతం మార్కులతో బంగారు పతకాన్ని సాధించి కళాశాలకు గౌరవాన్ని తీసుకువచ్చింది.అనంతపురంలోని జేఎన్టీయూ నిర్వహించిన 15వ స్నాతకోత్సవంలో గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా భావన గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం అందుకోవడం విశేషం. ఈ విజయంతో కళాశాల విద్యా నాణ్యత, బోధన ప్రమాణాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ, నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక ల్యాబ్ సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక దృష్టి, అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శకత వల్లే విద్యార్థులు విశిష్ట విజయాలు సాధిస్తున్నారని తెలిపారు. కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, ఇండస్ట్రీఓరియెంటెడ్ ట్రైనింగ్ అందించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.ప్రిన్సిపల్ జయచంద్ర, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వాసు, విభాగాధిపతి డాక్టర్ స్వప్నసుధ తదితరులు భావనను అభినందిస్తూ, ఈ విజయంతో ఇతర విద్యార్థులకు కూడా ప్రేరణ లభిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు.




# జీవాలను కాపాడుతూ ప్రాణాలు కోల్పోతున్న పశువైద్యులు

తిరుపతి విద్య ఏప్రిల్ 6 ప్రభాత వార్త

శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం అడ్మినిస్ట్రేటివ్ భవనం ముందు ఆంధ్రప్రదేశ్ పశు వైద్య విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ వెటర్నరీ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.విధి నిర్వహణలో భాగంగా కర్ణాటకలో హిప్పోపోటమస్ దాడిలో మరణించిన డాక్టర్ సమీక్ష రెడ్డి, అలాగే ఏనుగు దాడిలో ప్రాణాలు కోల్పోయిన డాక్టర్ విశ్వవాన్‌కు విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పవన్ నాయక్ మాట్లాడుతూ,పశువైద్యులు తమ విధుల్లో తీవ్రమైన ప్రమాదాలను ఎదుర్కొంటున్నప్పటికీ,తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం ఆందోళనకరమని అన్నారు.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, ఫీల్డ్ డ్యూటీలలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.పశువైద్యుల ప్రాణ భద్రతకు సంబంధించి స్పష్టమైన విధానాలు రూపొందించి, అవసరమైన రక్షణ పరికరాలు అందించాలని విద్యార్థులు కోరారు.ఈ కార్యక్రమంలో జే ఎజ్రా, నవీన్, విజయ్, విష్ణు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కౌశల వికాసం కీలకం..



### సంస్కృత వర్సిటీలో సమాపనోత్సవం

తిరుపతి విద్య, ఏప్రిల్ 6 ప్రభాత వార్త

విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, వక్తృత్వం, సృజనాత్మకతను పెంపొందించేందుకు నిర్వహించిన వివిధ కౌశల వికాస పరిషత్తుల సమాపనోత్సవాన్ని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైస్‌ఛాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులు సంస్కృతం, ఆంగ్లం, హిందీ, తెలుగు భాషల్లో కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవడం అత్యంత అవసరమని అన్నారు. వేదికలపై ధైర్యంగా మాట్లాడే నైపుణ్యం, సామర్థ్యం వంటి అంశాల్లో ఈ పరిషత్తులు విద్యార్థులకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.విశ్వవిద్యాలయంలో వాగ్వర్ధినీ పరిషత్, మాక్స్ ముల్లర్ ఇంగ్లీష్ క్లబ్, అన్నమాచార్య సాహిత్య కళాపరిషత్, తులసీదాస్ హిందీ పరిషత్, వేమ భూపాల కళాపరిషత్ వంటి వేదికల ద్వారా విద్యార్థుల భాషా, సాంస్కృతిక, సృజనాత్మక నైపుణ్యాలను అభివృద్ధి చేస్తూ సంవత్సరమంతా వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అకడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్ల, వివిధ పరిషత్తుల కోఆర్డినేటర్లు, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వాగ్వర్ధినీ పరిషత్ కోఆర్డినేటర్ ప్రొ. ప్రదీప్ కుమార్ బాగ్, అదనపు కోఆర్డినేటర్ డా. ఉదయన హెగ్డే సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.



# కొత్త కోర్సులు, సిలబస్‌కు ఆమోదం..

తిరుపతి విద్య, ఏప్రిల్ 6 ప్రభాత వార్త

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించిన సెనేట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య టాటా నర సింగరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అకడమిక్, పరిపాలనా అంశాలపై విస్తృ తంగా చర్చించారు.ఈ సందర్భం గా ఫార్మసీ విభాగంలో ఫార్మా స్యూటికల్స్, డ్రగ్ రెగ్యులేటరీ అనాలసిస్ అనే రెండు కొత్త కోర్సులకు ఆమోదం లభించింది. అదేవిధంగా ఎం.టెక్ మెటీరియల్స్ మినరల్స్ కోర్సుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.ఎన్ఈపీ2020 నిబంధనల ప్రకారం సిలబస్‌కు ఆమోదం లభించగా, బి.టెక్ 2025-26 రెగ్యులేషన్స్‌తో పాటు 3 నుంచి 8వ సెమిస్టర్ సిలబస్‌ను సెనేట్ ఆమోదించింది.అదేవిధంగా 2026-27 బడ్జెట్‌కు, 2025-26 సవరణ బడ్జెట్‌కు కూడా సెనేట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అటానమస్ హోదా పొందిన ఎస్‌పి సావిత్రమ్మ కాలేజ్, విజయమ్ కాలేజ్, సికాం కాలేజ్ అంశాలను కూడా ఆమోదించారు.ఈ సమావేశంలో రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, పూర్వ ఉపకులపతులు, సెనేట్ సభ్యులు ఆచార్య ప్రభాకర్ రావు, ఆచార్య శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇఎండీపీ ఎక్స్‌పోలో విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి



### బహుమతులు కైవసం

తిరుపతి విద్య, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

విద్యార్థుల్లో సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు ప్రతిఫ లించిన ఇఎండీపీ- 2026 ఎక్స్‌పోలో పలువురు విద్యా ర్థులు తమ ప్రతిభను చాటు కున్నారు. తిరుపతిలోని ఎం జీఎం ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఈ ఎక్స్‌పోలో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం కింద ఎంపికైన పది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు తమ ప్రాజెక్టులు, వినూత్న ఆలోచనలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తిరుపతి ఎస్.జె. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని సాధించగా, పుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఏపీసీ గౌరీశంకర్ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్న వయస్సులోనే సృజనాత్మకతను పెంపొందించుకుని భవిష్యత్తులో విజయవంతమైన వ్యవస్థాపకులుగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్, ఐఇడి కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి భాను

# తిరుపతి డివిజన్

## తారురోడ్డు నిర్మించాలని దళితుల నిరసన

పుత్తూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :



తడుకు - శిరుగురాజుపాలెం మార్గంలో తారు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని తడుకు పంచాయతీ ఎగువ గులూరు దళితులు సోమవారం గ్రామంలో ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య మాట్లాడుతూ 5 కిలోమీటర్లు వున్న ఈ రోడ్డు గుంతలమయమైందని, కంకర తేలిపోవడం వల్ల అటు వాహనదారులు, ఇటు పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అత్యవసర సేవలకు 108 వాహనం, అంబులెన్స్ రావడానికి అసౌకర్యంగా వుందన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ గ్రామీణ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నామని చేస్తున్న ప్రకటనలు ఆచరణకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే భానుప్రకాశ్‌లు ప్రజల కష్టాలు పట్టించుకుని ఈ మార్గంలో తారు రోడ్డు నిర్మించాలని కోరారు. నిరసనలో దళితులు కె.కాతవరాయన్, కె.నాగూర్, వి.నాగార్జున, ఎ.రామయ్య, టి.గిరిబాబు, బాలగురప్ప, పి.చెంగలరాయలుతదితరులుపాల్గొన్నారు.

## మోడి పాలనలో ఉజ్వల్ భారత్: నిషిధరాజు



పుత్తూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :

ప్రధానమంత్రి నరేంద్ర మోడి నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధితో భారతదేశం ప్రపంచంలోనే ఉజ్వలంగా వెలుగుతోందని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.నిషిదరాజు అన్నారు. బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం నగరి పట్టణంలోని టవర్ క్లాక్, పుత్తూరులో ద్రౌపదిదేవి గుడి వద్ద, అంబేద్కర్ సర్కిల్‌లో పార్టీ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఏకాత్మ మానవవాదం, క్రమశిక్షణ, అంకితభావం వంటి లక్షణాలతో ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా బిజెపి అవతరించిందన్నారు. ఎందరో కార్యకర్తల బలిదానాలపై పార్టీ నిర్మితమైందన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీధర్‌నాయుడు, మధు, మునిస్వామి, గణేష్, మరి, చక్రపాణినాయుడు, హెచ్.వెంకటరామరాజు, సౌందర్ పాడి, రాము, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఆదర్శప్రాయుడు పులివర్తి వినీల్

### టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కూరు ధనంజయ రెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:

నేటి యువతకు ఆదర్శప్రాయుడు టిడిపి యువనేత పులివర్తి వినీల్ అని టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కూరు ధనంజయ రెడ్డి అన్నారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద సోమవారం సక్కూరు ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో వినీల్ పుట్టిన రోజు వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాలతో కలసి కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్‌భాషా, సింగిల్ విండో అధ్యక్షుడు రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు కన్నయ్య నాయుడు, మంగాపురం భాస్కర్, నాగరాజ నాయుడు, మండలం లోకేష్ రాయల్, జగన్మోహన్ నాయుడు, కాపువీధి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ కాలనీలో రోగులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైద్యసేవలు

చంద్రగిరి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తిరుపతి వారి ఆధ్వర్యంలో శేషాపురం ఎస్టీ కాలనీలో గిరిజనులకు వైద్య సేవలు అందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావు ఆధ్వర్యంలో వైద్య బృందం ఎస్టీ కాలనీలో ఇంటింటికీ వెళ్ళి అనారోగ్యంతో భాధపడుతున్న రోగులకు బిపి, షుగర్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి, మం దులు అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు నాణ్య మైన వైద్యం అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 జిల్లాలో ఆర్ఈసి వారి సహకారం తో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా కొండలు, అటవీ ప్రాంతాల్లో సౌకర్యాల లేమితో భాధపడుతున్న గిరిజనులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

## టీటీడీ ఉద్యోగుల క్రికెట్ జెర్సీ రిలీజ్

తిరుపతి,ఏప్రిల్ 6ప్రభాతవార్త:



టిటిడి ఉద్యోగుల డిపార్ట్మెంట్ క్రికెట్ టోర్నమెంట్ యొక్క జెర్సీ లను టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు నిరంతరం ఏదో ఒక క్రీడల్లో పాల్గొంటే విధుల్లో కూడా ఉత్సాహంగా పనిచేస్తారు ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటారని, భక్తులకు మంచి సేవలు అందించడంతో పాటు, సంస్థకు మంచి పేరు తీసుకువస్తారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో తితిదే ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు చీర్ల కిరణ్, అజయ్, బాలాజీ, చైతన్య, ఈశ్వర్ నాయక్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌కు గురై రైతు మృతి



రామకుప్పం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

మండలంలోని ఎస్.గొల్లపల్లి గ్రామంలో విద్యుత్‌షాక్ తగిలి ఓ రైతు మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. గొల్లపల్లి గ్రామంకు చెందిన రైతు ఆనంద్ (40)తన వ్యవసాయ పొలం వద్ద బోరు విద్యుత్ స్టార్టర్ మరమ్మత్తులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడన్నారు. స్థానికులు గమనించి అతని కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. అయితే అప్పటికే ఆనంద్ మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆనంద్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## చెత్తపై పన్ను...ప్రజల మధ్య చెత్తే మిగిల్చిన వైసిపి - ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతిరూరల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :

గత వైసిపి ప్రభుత్వం చెత్తపై పన్ను విధించి, నిర్వాహణలో విఫలమై ప్రజల మధ్య చెత్తను పేరుకుపోయేలా చేసిందని ఎమ్మెల్యే పులివర్తి నాని విమర్శించారు. తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం పంచాయతీ పరిధిలో ఉన్న డంఫింగ్ యార్డును పురపాలకశాఖ మంత్రి నారాయణతో కలిసి పరిశీలించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో చెత్త సమస్య గత ప్రభుత్వ తప్పిదాల ఫలితమేనని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెత్తను సంపదగా మలచే దిశగా చర్యలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 100 డంఫింగ్ యార్డులలో చెత్త నుండి సంపద సృష్టి కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని వెల్లడించారు.దుర్గసముద్రం వద్ద సుమారు 10 ఎకరాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు.

# తిరుపతి డివిజన్

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం



రేణిగుంట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని రేణిగుంట మండలం మర్రిగుంట సమీపంలోని జాతీయ రహదారుల కూడలి వద్ద వాజ్ పాయ్ సర్కిల్ ప్రాంతంలో సోమవారం బిజెపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ముందుగా భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించి భారతరత్న వాజ్ పాయ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారతదేశం అన్ని రంగాలలో వెలిగిపోవడానికి జ్యోతి వెలిగించిన గొప్ప వ్యక్తి అటల్ బిహారి వాజ్ పాయ్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, బిజెపి మండల కార్యదర్శి రాజా రాయల్, రేణిగుంట పట్టణ బిజెపి అధ్యక్షుడు నరేష్ రాయల్, జిల్లా బిజెపి మోర్చా నాయకులు, ముదిరాజ్ సంఘం తిరుపతి జిల్లా కన్వీనర్ వేణు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం తిరుపతిలో జరిగే మన ఊరు మన జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొనటానికి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.

## వరదయ్యపాలెంలో బిజేపి 46వ ఆవిర్భావ దినోత్సవం



వరదయ్యపాలెం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: మండల అధ్యక్షుడు కే. దిలీప్ రాయల్ నాయకత్వంలో కార్యకర్తలు కూటమి నేతల జనసందోహం నడుమ కనీవినీ ఎరుగని రీతిలో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కె. దిలీప్ రాయల్ మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతదేశాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలిపిన ఘనత బీజేపిదేనన్నారు. బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు కూటమి నాయకులు జనసందోహం నడుమ ఎన్నడూ లేనివిధంగా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగ చేపట్టారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. పేదలకు అన్నదానం స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు దిలీప్ రాయల్ మాట్లాడుతూ అద్వానీ వాజ్ పాయ్, మోడీ వంటి మహా నేతల నాయకత్వంలో దేశాన్ని ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపిన ఘనత బీజేపికే దక్కిందని అన్నారు. జనసేన పార్టీ, చిత్తూరు తిరుపతి, ఉమ్మడి కార్యదర్శి, తడ శ్రీనివాసులు, మాట్లాడుతూ డబల్ ఇంజన్ సర్కార్ రాష్ట్ర, ప్రధానమంత్రి మోడీ, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, నాయకత్వంలో, అభివృద్ధి పదంలో దూసుకుపోతుందని తెలిపారు. మాజీ పార్టీ మండల అధ్యక్షులు, పురుషోత్తం మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ బలోపేతానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు కలిసికట్టుగా పనిచేసే విజయం వైపు ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సుబ్బరతమ్మ, ఎం జె కుమార్, మాజీ అధ్యక్షుడు పురుషోత్తం, డివిఎంసి, నెంబర్ గుత్తి త్యాగరాజు, ఆర్.మురళీ, ఓబీసీ మోర్చా డిస్టిక్ కార్యదర్శి, ఓబిసి మోర్చా కమ్యూనిటీ అధ్యక్షులు వాసు రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు, బోర్ర ప్రసాద్, యువ మోర్చా అధ్యక్షులు కల్లూరిమల్లికార్జున్ ,జనరల్ సెక్రెటరీ వేలూరు సూర్యనారాయణ, ఓ బి సి మోర్చా అధ్యక్షులు శ్రీనివాసులు, కిసాన్ మోర్చా అధ్యక్షులు, వాటం బెడ్ అంకయ్య, వైస్ ప్రెసిడెంట్‌లు గోపి, సుబ్రహ్మణ్యం, లోకేష్, కార్యదర్శి, ముని బాబు, మోహన్ శెట్టి, పురుషోత్తం, నాగేంద్ర, తెలుగుదేశం పార్టీ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మంది రమణయ్య, నాయకులు, తొండ కోటి, గోవర్ధన్, మహిళా అధ్యక్షురాలు, మునుభూషణమ్మ, జనసేన నాయకులు పసుపులేటి విజయకుమార్, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టండి

**- ఆర్‌డిఓకు డీవీఎంసీ మెంబెర్ విజ్ఞప్తి**



వరదయ్యపాలెం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: ప్రాంతంలోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని డీవీఎంసీ మెంబెర్, దేవాంగ అభ్యుదయ సేవా సంఘం ప్రెసిడెంట్ గుత్తి త్యాగరాజు, రెవిన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) డి.దేవేందర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సూళ్లూరుపేటలోని ఆర్‌డీఓ కార్యాలయంలో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీలో పలు ముఖ్య అంశాలపై చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ దేవేందర్ రెడ్డిని సంప్రదాయ వస్త్రంతో సత్కరించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరై కీలక సమస్యపై వినతిపత్రం సమర్పించినట్లు త్యాగరాజు తెలిపారు.

## ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 41 వినతులు



తిరుపతి,ఏప్రిల్ 6ప్రభాతవార్త: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 41 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 36 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 5 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా రవీంద్ర నగర్ నందు త్రాగునీటి పైప్ లైన్ వేశారు నీటి సరఫరా చేయాలని, యూడిఎస్ లైన్ మరమ్మత్తు చేయాలని, తాను ఇల్లు విక్రాయించలేదు అయినా వేరొకరి పేరు మీరు పన్ను వస్తోంది పరిష్కరించాలని, కొర్లగుంట మారుతీ నగర్ లో తన స్థలం ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారు పరిష్కరించాలని, తాతా నగర్ వద్ద ఖాళీ జాగాలో చెత్త వేస్తున్నారు పరిష్కరించాలని, ఇందిరా మైదానం వద్ద టెంకాయల వ్యాపారి వ్యర్థాలను వేయడం వలన ఇబ్బందిగా ఉందని, గాలి వీధి లో అపరిశుభ్రతను పరిష్కరించాలని, ఇందిరామైదానం వద్ద చెత్త తొలగించాలని, గొల్లవానిగుంట నందు సిసిరోడ్లు, కాలువలు వేయించాలని, ఇంటికొసం డబ్బులు కట్టాము తిరిగి ఇప్పించాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీలు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## ప్రత్యేక ప్రణాళికలతో చెరువుల అభివృద్ధి

**ఎంఎల్ఏ పులివర్తి నాని**



రామచంద్రాపురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: ప్రత్యేక ప్రణాళికలతో చెరువులను అభివృద్ది పరుస్తామని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. సోమవారం రాయలచెరువు కట్టపై నీటిభధ్రత, సాగునీటి సంఘాల భాధ్యత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా చెరువుల మరమ్మత్తులు, పూడికతీత, కాలువల అభివృద్ధి వంటి పనులు చేపడతారన్నారు. చెరువుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ప్రభుత్వం నుండి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. రాయలచెరువు అభివృద్ధి ప్రత్యేకించి రూ.50 కోట్లతో అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంత రైతులకు నష్టపరిహారం అందించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జనార్ధన్ చౌదరి, రాయలచెరువు ఆయకట్టు చైర్మన్ అర్జున్ నాయుడు, వైస్ చైర్మన్ త్యాగరాజులు, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు, టిడిపి నాయకులు తానికొండ కేశవులు నాయుడు, జెడి జగన్, రావిళ్ళ గిరి, నరశింహారెడ్డి, కోరా హరిప్రసాద్, లెక్కల సురేంద్ర నాయుడు, లెక్కల మహేష్ నాయుడు, ఇరిగేషన్ ఈఈ ప్రసాద్, తహశీల్దార్ మధుసూదన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలపై కఠిన చర్యలు!

**-పట్టణ సుందరీకరణకు సహకరించండి**
**-మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్**



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో దురాక్రమణలను అనుమతించమని,ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని, పట్టణాన్ని సుందరీకరణకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమినర్ భవాని ప్రసాద్ వివరించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి టెంపుల్ టౌన్ మాత్రమే కాదని వ్యాపార కేంద్రంగా ఉందని ఇక్కడ నిత్యం దూర ప్రాంతాల నుంచి వేలాది మంది వస్తుంటారని కాబట్టి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల శ్రీకాళహస్తి పట్టణంలో ఆక్రమణల పర్వం పెచ్చుపెరిగిందని కాబట్టి కఠినంగా వ్యవహరిస్తు న్నామని వివరించారు. అయితే ఆక్రమణలను తొలగించినపుడు కొందరు ఉద్యోగులను అవమాన సరుస్తూ మాట్లాడుతున్నారని ఇది సరైన పద్దతి కాదన్నారు.తాము ఏదీ మున్సిపల్ చట్టం నిబంధనలకు వ్యతిరేకంగా పని చేయటం లేదన్నారు. అన్ని రికార్డులున్న ఇళ్ళ జోలికి వెళ్ళటం లేదని వివరించారు.

**కొనుగోలు అమ్మకాల సమయంలో మున్సిపాలిటితో సంప్రదించండి:**

శ్రీకాళహస్తి మున్సిపాలిటి పరిధిలో కొనుగోళ్ళు అమ్మకాల సమయంలో లబ్దిదారులు మున్సిపాలిటితో సంప్రదించాలని కమిషనర్ భవాని ప్రసాద్ వివరించారు.అవగాహన లోపంతో కొనుగోళ్ళు చేస్తే రెగ్యూలరైజేషన్‌కు లక్షలు వెచ్చించుకోవాలని కమిషనర్ సూచించారు.ఇళ్ళ నిర్మాణం, ప్లాట్ల కొనుగోలుకు సంబందించి అది మున్సిపల్ లేఅవుట్ అప్రూవల్ అయ్యిందా? లేదా? అనే సమాచారం కోసం మున్సిపాలిటిని సంప్రదించాలని వివరించారు.సమాచారం కోసం సచివాలయం మున్సిపాలిటిలో పట్టణ ప్రణాళికాభివృద్ధి శాఖను సంప్రదించవచ్చునన్నారు.ప్రస్తుతం ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించిన ప్లాన్‌లను ఎవ్వరి కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదని కమిషనర్ స్పష్టం చేసారు. జిఒ ఎంఎస్ నెంబర్ 20 ప్రకారం ఆన్‌లైన్లోనే దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. వ్యక్తిగత సర్టిఫికేట్ సరిపోతుందన్నారు.తాము సర్వేనెంబర్, డాక్యుమెంట్లు మాత్రమే పరిశీలిస్తామన్నారు.అక్రమ ఆక్రమణలపై ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలిచ్చిందన్నారు. నెల్లూరు మంత్రి నియోజకవర్గంలో48 ఆక్రమణలను తొలగించామన్నారు. ఒక అపార్టు మెంటునే తొలగించారన్నారు.తాను ఆధికారం చేపట్టిన తరువాత 38ఆక్రమణలకు సంబంధించి గతంలో నోటీసులు జారి చేసారని అయితే తాను బాధ్యతలు చేపట్టిన తరువాత చార్జిషీట్లను దాఖలు చేసామన్నారు.మరో 30 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.ఆదివారం ఓ ఆక్రమణలకు సంబంధించి బాధితులు అధికారులపై అవమానకంగా మాట్లాడుతున్నారని అయితే తాము చట్టబద్దంగా వ్యవహరించామన్నారు. తాము బాధ్యతలు చేపట్టిన తరువాత వారికి రెండుసార్లు నోటీసులు జారి చేసామన్నారు.కానీ తమ ఆదేశాలు ఖాతరు చేయక నిర్మాణాలు చేపట్టడం వల్లనే తొలగించాల్సి వచ్చిందన్నారు.ఒక వేళ వారికి కోర్టు ఉత్తర్వులున్నా లేక అనుమతి ఉన్నా చూపించవచ్చు కదా అని కమిషనర్ భవాని ప్రసాద్ వివరించారు.

## ముత్యాలమ్మ ఆలయంలో జాతర ముస్తాబులు

**-నేడు శ్రీకాళహస్తీశ్వరాయంచే సారె బహూకరణ**



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంలో శక్తి నిలయాలుగా బాసిల్లుతున్న ఆలయాల్లో ఒకటైన ముత్యాలమ్మ ఆలయంలో సాంప్రదాయ పద్దతుల్లో జాతర ఉత్సవానికి ముస్తాబు చేస్తున్నారు. ప్రతి ఏడాది ఎంతో అనందోత్సాహాలతో నిర్వహించే ముత్యాలమ్మ జాతరను నిర్వహించుటకు ఏర్పాట్లను రెండురోజుల పాటు ఆలయ ఇఓ బికె వెంకటేశులు అధికారులతో పర్యవేక్షించారు. ఆదివారం రాత్రి చాటింపుతో జాతర ప్రారంభం అయ్యింది. మూడు రోజుల పాటు సాంప్రదాయ పద్దతుల్లో అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించనున్నారు. స్థానికంగా గ్రామ దేవతగా శక్తి స్వరూపిణిగా భక్తజన కొంగుబంగారంగా ముత్యాలమ్మ కొలువు దీరి భక్తజనాలను అనుగ్రహిస్తున్నారు. ఏడు గంగమ్మల్లో ఒక గంగమ్మగా కొలువుదీరి అమ్మవారి భక్తజనాన్ని కటాక్షిస్తున్నారు. శక్తిస్వరూపిణి అయిన అమ్మవారిని మంగళ, శుక్ర, ఆదివారాల్లో ఉపవాస దీక్షలతో మహిళలు కొలుస్తూ తమ కోర్కెలను నెరవేర్చుకుం టున్నారు. భక్తజనాల కోర్కెలను అమ్మవారు మన్నిస్తూ కోరిన కోర్కెలను తీర్చే కల్పవల్లిగా బాసిల్లుతుంది. భిన్నంగా ముత్యాలమ్మఆలయంలో అమ్మవారి మూలవిరాట్టుకు ఎదురుగా అమ్మవారి వివిధ రూపాల్లో ముగ్గుగా తీర్చిదిద్ది పూజలు నిర్వహించి జాతర జరపడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ముత్యాలమ్మ జాతరను పురస్కరించుకొని అమ్మవారి ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ మంతా అరటి, మామిడి తోరణాలతో పచ్చగా కళకళలాడే విధంగా అలంకరించారు. ఆలయం నుండి గెరిక తీసుకొని ఉత్సవంగా పట్టణ పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహిస్తారు. ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని మైలుముగ్గుగా తీర్చిదిద్దారు. ఈ మైలుముగ్గుకు విశేష పూజలను సాంప్రదాయపద్దతుల్లో నిర్వహిస్తారు. అనంతరం కుంభం వేసి బలిప్రసాదాలు సమర్పించి విశేష హారతులివ్వటం ఆనవాయితి. అనంతరం పెద్దఎత్తున స్థానిక భక్తులు అమ్మవారి విశ్వరూప మైలుముగ్గును దర్శించుకొని పూజలు నిర్వహించుకొనుటకు ఆలయ ఇఓ బికె వవెంకటేశులు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు.

## సంకట చతుర్దశి హోమాలు: అభిషేకాలు



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయక ఆలయం వద్ద సోమవారం సంకట చతుర్ధశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్ పెక్టర్ వవెంకటస్వామి ముఖ్య అతిధులుగా హాజరైన పూజల్లో గణపతి హోమాలను ఏర్పాటు చేసారు. కొంత కాలంగా ఆలయంలో పలు సేవలకు భక్తుల భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలోనే సంకటహర చతుర్ధశి ఏర్పాటు చేసారు. వేదపండితులు వేదమంత్రాలను పఠిస్తుండగా ఎస్ఎంకె శ్రీనివాసులు గురుకుల్ శాస్త్రోక్తంగా హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఏర్పాట్లును వెంకటముని పర్యవేక్షించారు.

## బంగారమ్మ ఆలయంలో బాలాలయం



**రూ.7.5లక్షలతో మరమ్మతులు**

తొట్టంబేడు,ఏప్రిల్ 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న గ్రామ దేవత బంగారమ్మ ఆలయం మరమ్మతులకు శ్రీకారం చుట్టారు.ఈ నేపధ్యంలో సోమవారం ఆలయ ఆవరణలో బాలాలయ స్థాపన కార్యక్రమాలను భక్తి శ్రద్దలతో ఇక్కడి సంప్రాయం మేరకు నిర్వహించారు. ఆదివారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమైన పూజల్లో సోమవారం బాలాలయ స్థాపనలో ఆలయాధికారులు స్థానికులు హాజరయ్యారు.మంగళవాయిద్యాలు, విఘ్నేశ్వర పూజలు, కలశ పూజ, యాగశాల ఏర్పాటు పూజలు,శాస్త్రోక్తంగా హోమాలు పూర్ణాహుతి దూప దీన నైవేద్యంను అందించారు. మిధున లగ్నమందు కలశ ఉద్వాసన,బాలాలయ చిత్రపటానికి కలశాభిషేకం,ధూప దీపనైవేద్యాలు,మంత్రపుష్పం, ఆశీర్వాదం ప్రసాదాలను అందించారు.ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, బోర్డు సభ్యుడు వాకచర్లగుర్రప్పశెట్టి,ప్రత్యేకాహ్వానితులు సిహెచ్ శైలజ, ఆలయాధికారుల్లో డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, ఇఇ శ్రీనివాసులురెడ్డి, అనుబంధ ఆలయాల ఎఇఓ హేమామాలిని,లక్ష్మయ్య, పౌరోహితులు అర్ధగిరి ప్రసాద్, అర్చకులు దక్షిణామూర్తి, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన రాజేశ్వరి ఆలయ అభివృద్ది పరచిన సిద్దులు గారి జయబాబు,స్థానికులు సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సోమశేఖర్ నాయుడు, మనోహర్, అమ్ములు, సారధి, లీలామోహన్, వాసునాయుడు, ఉప్పు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## 10న సామాజిక తనిఖీ బహిరంగసభ

తొట్టంబేడు,ఏప్రిల్ 6 ప్రభాతవార్త: తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10న సామాజిక తనిఖీ బహిరంగసభను ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఓ సురేంద్రనాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.మండలంలోని 27 పంచాయతీల్లో గల గ్రామాల్లో 18వ విడత సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో జరిగిన పనులకు సంబంధించి, పంచాయతీరాజ్, హౌసింగ్, అటవీశాఖ, సమగ్రశిక్ష అభియాన్ శాఖల పర్యవేక్షణలో జరిగిన పనులపై గ్రామస్థాయిలో 2026 జనవరి 28 నుంచి2026 మార్చి 11 వరకు గ్రామసభలు జరిపి తనిఖీ చేసినట్లు వివరించారు.ఈ నివేదిక విషయాలను ఈ నెల 10న మండల పరిషత్ కార్యాలయంలో బహిరంగసభను ఏర్పాటు చేసి ప్రజలకు తెలియజేస్తామని వివరించారు.

## చెవిరెడ్డిని కలసిన వైకాపా కార్యకర్త చందు



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తికి చెందిన విద్యార్థి విభాగానికి చెందిన చందు సోమవారం చంద్రగిరి మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కలసి అభినందించారు. శ్రీకాళహస్తికి చెందిన చందు వైకాపా కార్యకర్త ఆది నుంచి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అభిమాని. ఆయన జైలు నుంచి విడుదలైన సందర్బంగా ఆయన్ను కలసి శుభాకాంక్షలు తెలి పారు. కూటమి ఇలాంటి కక్షపూర్తి ఆరెస్టులను మానుకోవాలన్నారు.

## బొజ్జల...అధికార దుర్వినియోగం చేయరు!



శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని సుమారు 5 దశాబ్దాలుగా పరిపాలిస్తున్న బొజ్జల కుటుంబం ఎప్పుడూ అధికార దుర్వినియోగానికి పాల్పడరని బిసి నేతలు సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్పష్టం చేసారు.జనసేన బహిష్కృత నేత కోట వినూత దంపతులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యాలపై స్పందిస్తూ దేశం బిసి వర్గాలు మీడియా సమావేశం ఏర్పాటు చేసారు.తెలుగుదేశం పార్టీ కానీ ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి కుటుంబం ఎప్పుడూ అధికార దుర్వినియోగం చేయరని స్పష్టం చేసారు. పట్టణంలో నిబంధనలను అ తిక్రమించి నిర్మిస్తున్న కట్టడానికి సంబంధించి మున్సిపల్ కమిషనర్ పలుమార్లు హెచ్చరించినా ఖాతరు చేయక నిర్మిస్తున్న కట్టడాలను తొలగిస్తే దానిని రాజకీయం చేసి లబ్ది పొందటానికి ప్రయత్నించటం దివాలకోరుతనానికి నిదర్శనం అన్నారు. మీడియా సమావేశంలో డాక్టర్ ఉమేష్‌రావు,వజ్రం కిషోర్, మిన్నల్‌రవి, యం.సుబ్బయ్య, డాక్టర్ ఎంఉమేష్‌రావు, చిల్లకూరు మణి, కోట చంద్రశేఖర్, రమేష్, సురేమాన్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## చట్టం తన పని చేస్తే... శాసనసభ్యునికి సంబంధం ఏమిటి?

తొట్టంబేడు, ఏప్రిల్ 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంటే శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డికి సంబంధం ఏమిటని దేశం నాయకులు ప్రశ్నించారు. చట్టానికి వ్యతిరేకంగా ఎవరు ఏ పని చేసినా తమ పార్టీ వారే అయినా ఎంఎల్ఏ ఉపేక్షించరని వారు వివరించారు.ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పై జనసేన పారీ బహిష్కృత నేత కోట వినుత, కోట చంద్రబాబు నాయుడు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ నాయకులు ఖండించారు. పోలీసు వ్యవస్థను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి అనుకూలంగా`గుండాల్లా వ్యవహరిస్తున్నారు అని కోట వినుత చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు విజయ్ కుమార్, కాసరం రమేష్, నాగమల్లి దుర్గాప్రసాద్, జి. గోపీనాథ్, షకీర్ అలీ,సుధాకర్ రెడ్డి, మహిళా నాయకులు అనిత, సుమతమ్మ మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్వయంగా పార్టీ నుంచి బహిష్కరించిన కోట వినుత పార్టీకి సంబంధం లేని వ్యక్తి అని ఆమె ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ని విమర్శించే అర్హత లేదన్నారు. పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించి, సంబంధిత వ్యక్తులను అరెస్ట్ చేసి విచారణ జరిపి, ఇలాంటి కుట్రపూరిత రాజకీయాలకు చెక్ పెట్టాలని టీడీపీ నాయకులు కోరారు.

## నాసా స్పేస్ కాంటెస్ట్‌లో విజేతగా విద్యార్థులు



శ్రీకాళహస్తి ఏప్రిల్ 6 ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ శ్రీచైతన్య విద్యార్థులు అమెరికా ఎన్ ఎస్ ఎస్ (నాసా స్పేస్ సెటిల్మెంట్) ప్రతిష్టాత్మకమైన నందు తమ ప్రతిభను చాటి ఘన విజయాన్ని సాధించారు.కాన్సంట్ 2026ఈ అద్భుతమైన విజయంతో ప్రపంచ స్థాయిలో శ్రీచైతన్య విద్యార్థులు తమ మేధస్సును,కృషి,పట్టుదలను చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో డీన్ త్రివేణి,ఇన్చార్జులు శ్రీహరి, వంశీ,నాసా ఇంచార్జ్ కవిత,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటియుసి మహాసభలను జయప్రదం చేయండి



శ్రీకాళహస్తి ఏప్రిల్ 6 ప్రభాతవార్త: ఏప్రిల్ 26 నుండి 29వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు తిరుపతిలో జరిగేటువంటి ఏఐటి యుసి మహాసభను జయప్రదం చేయాలని బియ్య గోడౌన్‌లో కార్యకర్తలతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సిపిఐ పార్టీనియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య,ఏఐటియుసిమురళి పాల్గొని మాట్లాడుతూ భారతదేశంలో ఏర్పాటైన మొట్టమొదటి కార్మిక సంఘం ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ)ఈ సంఘం ఏర్పడి 106 వ సంవత్సరం జరుగుతుంది అని కార్మికుల హక్కుల సాధనలో చట్టాల రూపకల్పనలో కార్మికులకు రక్షణ కల్పించడంలో కనీస వేతనాలు సాధన 8 గంటల పని విధానం అమలు పరచడం లో కార్మికులకు అండగా ఉద్యోగ భద్రత కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నటువంవి ఏఐటీయూసీ పోరాటపలిమేనని తెలిపారు .ఈ కార్యక్రమంలో సీతారాంపేట బాలాజీ,మోహన్ ,దేవేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆవిర్భావ సంబరాలు... జెండా ఆవిష్కరణలు



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 6ప్రభాతవార్త: శ్రీకాళహస్తి లోని పలుచోట్ల బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా జరిపారు.పలుచోట్ల బిజెపి జెండాను ఆవిష్కరించారు. సోమ వారం రాష్ట్రబిజెపి ఉపాధ్యక్షులు కోలా ఆనంద్‌కుమార్ దిశ దేశ నిర్దేశంతో పట్టణ అధ్యక్షుడు హరిష్‌రెడ్డి అధ్యక్షతన కార్యక్ర మాలను అమలు చేసారు. పట్టణంలోని కూడలి ప్రాంతమైన రామసేతు వంతెన, జయరామరావువీది, పూసల వీధి, కొత్తపేటలోని శీతలాంబ ఆలయ కూడలి వద్ద సీనియర్ నాయకులచే పతాకావిష్కరణ ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.ఈ సందర్బంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జనసంఘ్ నుంచి బిజెపి ఆవిష్కరించబడిందన్నారు. బిజెపి ఆవిర్భవించి 47 సంవత్సరాలుపూర్తి చేసుకుందన్నారు. పార్టీ పగ్గాలు నరేంద్రమోదీ,అమిత్‌షా చేపట్టిన తరువాత తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దారన్నారు.అట్టడుగు సామాన్య ప్రజలకు రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా ప్రభుత్వ ఫలాలు అందేలా సుపరిపాలన లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. నేడు రాష్ట్రాలో అమలు జరుగుతున్న ప్రజాభివృద్ధి పథకాలన్ని కేంద్రంలోని బిజెపి అ ందించినవే అన్నారు. సేవయే పరమావధిగా దేశమే ప్రథమంగా జనసంఘ్ నుంచి నేటి బిజెపి వరకు జెండాలను మోసిన నాయకులను స్మరించుకుంటూ బిజెపి అదిస్తున్న ఫలాలను అందిస్తున్నారని వివరించారు.ఈ కార్యక్రమాల్లో బిజెపికి చెందిన చిలకార ఒగయ్య, కంద్రిగ ఉమ, కూనాటి నాగరాజు, కొండేటి గోపాల్, మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, చాగణం శైలజ.ప్రజ్ఞన శ్రీ వేదాం కృష్ణయ్య, భగీర్తి వెంకటేష్, గరికపాటి రమేష్‌బాబు, ఉమాసింగ్,కుప్పా ప్రసాద్, అమర్‌నాథ్, ఇమిడిశెట్టి రామమోహన్‌రావు, కన్నా వెంకటేశ్వర్లు, మద్దు వాసు యాదవ్, పుణ్యం డిల్లికుమార్, కోనేటి అయ్యప్ప, చుండు రాయల్,, బాల,గోవర్ధన్, రవిచంద్ర, యతీష్, సజ్జా హరిష్, కిరణ్,,మణి, ఫ్లెక్సి కృష్ణారెడ్డి, శేషుకుమార్,,పునీత్, యశ్వంత్, వహీదా బేగం,రవి రాయల్,, ధనుష్, చోటు, కుమార్, డక్కిలి శివ,సిద్దూ రాయల్, సుబ్బరాయులు, తులసి, భాను,మనోహర్, అనిల్‌కుమార్, హరి, కిరణ్, రాజా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## జూ.సివిల్‌జడ్జిని సత్కరించిన బార్ అసోసియేషన్



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తికి చెందిన తిరుకాల ఉమామహేష్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైనందుకు పలువురు అభినందిస్తు న్నారు. ఈ నేపధ్యంలో సోమవారం బార్ అసోసి యేషన్ సారధ్యంలో సన్మానించారు. శ్రీకాళహస్తికి చెందిన యువకులు పోటీ పరిక్షల్లో పాల్గొంటూ అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో బార్ కౌన్సిల్ అధ్యక్షులు, ప్రధానకార్యదర్శి, కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## అన్నదానంతో ముగిసిన...రామనవమి ఉత్సవాలు



తిరుపతి,ఏప్రిల్ 6ప్రభాతవార్త: తిరుపతి పెద్దకాపు వీధిలో వెలసిన శ్రీరామ భజన మందిరంలో నవమి ఉత్సవాలు ముగిశాయి. సోమవారం చివరగా అన్నదానం నిర్వహించారు .స్థానికులు సీతారాములను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. చివరి రోజు అన్నదానం మట్లూరు చిన్న మునిరెడ్డి,మట్లూరు బొజ్జయ్య జ్ఞాపకార్థం మాట్లూరు రమాదేవి ఉభయదారులు వ్యవహరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, తొండము నాటి చంద్రశేఖర్ రెడ్డి, సూరా దయాకర్ రెడ్డి,మమత,పోతన సుర, హేమ ఆదిలక్ష్మి,శైలజ, వసంతమ్మ, తొండమునాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, విజయమ్మ,లోక ప్రభాకర్ నాయుడు,లక్ష్మమ్మ, ముని కృష్ణయ్య,చిన్ని తదితర భక్తులు పాల్గొన్నారు